

RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

సంపుటి : 18
సంచిక : 129
Vol : 18
Issue : 129

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, గురువారం 16 జులై 2026
Warangal, Thursday 16 July 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00



WANTED

పీపుల్స్ డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

సెంటర్లు
- హనుమకొండ
- కరీంనగర్
- భూపాలపల్లి
- పెద్దపల్లి/రామగుండం
- జనగామ
- మహబూబాబాద్
- హైదరాబాద్
- నిజామాబాద్

Cell : 9493019044
9618509859



# 'సర్' గడువు పొడిగింపు

తెలంగాణలో ఓటర్లకు భారీ ఊరట..

ఆగస్టు 3వరకు నమోదుచేసుకునే చాన్స్

ఆగస్టు 10 నుంచి సవరణలు అభ్యంతరాలు స్వీకరణ

అక్టోబర్ 12న తుది ఓటర్ల జాబితా విడుదల



పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ గడువును ఈనెల 24వ తేదీ నుంచి ఆగస్ట్ 3వ తేదీ వరకు పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయ పార్టీల విజ్ఞప్తులు, క్షేత్రస్థాయిలో సర్వే నెమ్మదిగా సాగుతుండటంతో కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలోనే తాజా షెడ్యూల్ ప్రకారం బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) ఆగస్ట్ 3వ తేదీ వరకు ఇంటింటి సర్వే, ఓటరు వివరాల సేకరణ, ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియను కొనసాగిస్తారు. ఆ తర్వాత ఆగస్ట్ 10వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ముసాయిదా ఓటర్ల జాబితాను (మిగతా 2లో...)

# తలకిందులైన ఆఫీస్ మార్కెట్

- హైదరాబాద్‌లో వృద్ధి.. బెంగళూరులో పతనం..
- ఆరు నెలల్లో ఇదీ పరిస్థితి

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : భారతదేశంలో బిగ్గెస్ట్ ఆఫీస్ మార్కెట్ బెంగళూరు అన్న సంగతి తెలిసిందే. అయితే ఇటీవల పరిస్థితి మారిపోయింది. ఈ ఏడాది జనవరి– జూన్ సమయంలో ఆఫీస్ స్పేస్ లీజింగ్ ఇక్కడ 21 శాతం తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. ఇదే సమయంలో హైదరాబాద్ నగరంలో మాత్రం 18 శాతం వృద్ధి నమోదైంది. దేశంలోని ప్రధాన నగరాల్లో పరిస్థితి చూద్దాం. రియల్ ఎస్టేట్ మార్కెట్ కొంత

(మిగతా 2లో...)



# భవిష్యత్ బాట.. డేటా..!

- ఇక రానుంది డిజిటల్ ఉద్యోగ యుగం
- భారత్‌లో డేటా సెంటర్ బూమ్..
- 2030 నాటికి యువతకు భారీ ఉపాధి అవకాశాలు

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : భారత్‌లో వేగంగా విస్తరిస్తున్న డేటా సెంటర్ పరిశ్రమ దేశంలోని అతిపెద్ద ఉపాధి కల్పన రంగాల్లో ఒకటిగా అవతరిస్తోంది. 2030 నాటికి ఈ రంగంలో దాదాపు లక్ష మంది నైపుణ్యం కలిగిన నిపుణుల అవసరం ఏర్పడనున్నట్లు ఎన్ఎల్‌బీ సర్వీసెస్ తాజా నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో సుమారు 1.5 గిగావాట్ల స్థాపిత డేటా సెంటర్ సామర్థ్యం ఉండగా, దశాబ్దం చివరి నాటికి ఇది 6.5 గిగావాట్లకు చేరుకునే అవకాశముందని నివేదిక పేర్కొంది. అదే సమయంలో భారత డేటా సెంటర్ మార్కెట్ విలువ 22 బిలియన్ డాలర్లకు పైగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది..

భారత డేటా సెంటర్ మార్కెట్ రంగంలో ఇప్పటికే 126 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడి హామీలు నమోదయ్యాయి. దీంతో డేటా సెంటర్ పరిశ్రమ దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మౌలిక సదుపాయాల రంగాల్లో ఒకటిగా నిలుస్తోంది. అయితే, పరిశ్రమ వృద్ధికి అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరుల కొరత భవిష్యత్తులో సవాలుగా మారే అవకాశం ఉందని నిపుణులు (మిగతా 2లో...)

- నిర్మానుష్య ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న మందుబాబులు
- సాయంకాల సమయంలో దొంగతనాలు, జంటలకు బెదిరింపులు
- మద్యం సేవించి క్రైంకు తెరలేపుతున్న కిరాతకులు
- నిర్మానుష్య ప్రాంతాల్లో భూ తగాదాలు, పంచాయతీలు
- భారీ వాహనాల రాకపోకలతో ప్రమాదాలు
- మిల్స్ కాలనీ, అటు మడికొండ పోలీసులకు తప్పని ఇక్కట్లు
- కనీస జాగ్రత్తలు పాటించని వరంగల్ బల్దియా అధికారులు
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ అధికారులు..??

2లో



# నేరాలకు కేరాఫ్ అమ్మావారిపేట క్రాస్

కల్లు మండువలు, బెల్ట్ షాపులతో కిటకిట

ఉర్సుగుట్ట రోడ్డు మొదలు అమ్మవారిపేట వరకు 'డేంజర్‌జోన్'!



# నిరీక్షణకు చెక్!

- పది నిమిషాల్లోనే ఇంటికి గ్యాస్ సిలిండర్?
- ఇక రోజుల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేదు
- ఆ గ్యాస్ కంపెనీతో 'స్విగ్గీ' జట్టు..?
- క్విక్ కామర్స్‌లో సిలిండర్ల డెలివరీకి సన్నాహాలు

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : వంట గ్యాస్ సిలిండర్ కోసం రోజుల తరబడి వేచి చూసే సమయం ముగిసింది. ఇక నిమిషాల వ్యవధిలోనే ఇంటికి సిలిండర్ వచ్చే రోజులు వచ్చేశాయి. పాలు, కూరగాయలు, కిరాణా సామాన్లు కేవలం 10 నిమిషాల్లో డెలివరీ చేస్తున్న క్విక్ కామర్స్ యాప్స్ ఇప్పుడు మరో అడుగు ముందుకు వేశాయి. వంట గ్యాస్ సిలిండర్ హఠాత్తుగా అయిపోతే రోజుల తరబడి వేచి చూసే ఇబ్బందులవకు చెక్ పెడుతూ ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ సంచలన (మిగతా 2లో...)



# జీవ వైవిధ్య రక్షకులు

నేడు అంతర్జాతీయ పాముల దినోత్సవం

- పాములను చంపకుండా కాపాడుదాం...
- అపోహలు, మూఢనమ్మకాలు వీడండి
- భారతదేశంలో 300లకు పైగా పాము జాతులు
- కొన్ని మాత్రమే విషపూరితమైనవి

**పీపుల్స్‌డైరీ–ప్రత్యేక ప్రతినిధి :** భూమిపై జీవ వైవిధ్యాన్ని కాపాడడంలో పాముల పాత్ర అత్యంత కీలకం. కానీ అవగాహన లోపం, మూఢనమ్మకాలు, భయాందోళనల కారణంగా పాములు మనుషుల చేతుల్లోనే ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నాయి. ప్రతి ఏడాది జూలై 16న అంతర్జాతీయ పాముల దినోత్సవం నిర్వహించడం ద్వారా పాముల ప్రాముఖ్యత, వాటి సంరక్షణ అవసరంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

పాములు వ్యవసాయానికి మిత్రజీవులు. పొలాల్లో పంటలను నాశనం చేసే ఎలుకలు, చిన్న కీటకాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా రైతులకు పరోక్షంగా మేలు చేస్తాయి. ఎలుకల సంఖ్యను నియంత్రించడం వల్ల పంట దిగుబడులు పెరగడమే కాకుండా, ఎలుకల ద్వారా వ్యాపించే కొన్ని వ్యాధుల ప్రమాదం కూడా తగ్గుతుంది.

**భారత్‌లో పాముల వైవిధ్యం :** భారతదేశంలో సుమారు 300కు పైగా పాముల జాతులు ఉన్నాయి. వీటిలో దాదాపు 60 జాతులు మాత్రమే విషపూరితమైనవి. మిగిలినవి మనుషులకు హానికరం కాని పాములే. అయినప్పటికీ కనిపించిన ప్రతి పామును చంపేయడం వల్ల ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోంది. (మిగతా 2వ పేజీలో...)

# 'డేలైట్ సేవింగ్'కు అమెరికా తెర

రెండో ప్రపంచ యుద్ధం నాటి ఆచారం బంద్..

అమెరికాలో మారబోతున్న టైం విధానం...

పీపుల్స్‌డైరీ–వెబ్‌డెస్క్ : అమెరికాలో దశాబ్దాలుగా సాగుతున్న గడియారాల ముళ్లు మార్చే సంప్రదాయానికి త్వరలోనే తెరపడనుంది. ఏడాదికి రెండుసార్లు సమయాన్ని గంట ముందుకు, వెనక్కి జరుపుతూ ప్రజలను అయోమయానికి గురిచేసే 'డేలైట్ సేవింగ్ టైమ్' (డీఎస్టీ) విధానాన్ని ఇకపై శాశ్వతం చేయాలని యూఎస్ ప్రతినిధుల సభ సంచలన నిర్ణయం తీసుకుంది. మంగళవారం జరిగిన ఓటింగ్‌లో ఈ బిల్లుకు అనుకూలంగా 308–117 ఓట్లతో భారీ మెజారిటీ లభించింది. ఈ బిల్లుకు గనుక సెనేట్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, అధ్యక్షుడు సంతకం చేస్తే.. అమెరికన్లు మళ్లీ మళ్లీ తమ వాచ్‌లలో టైమ్‌ను మార్చుకోవాల్సిన అవసరం



ఉండదు. సాధారణంగా అమెరికాలో వేసవి కాలంలో పగటి వెలుతురును గరిష్ఠంగా ఉపయోగించుకోవడానికి, విద్యుత్‌ను ఆదా చేయడానికి గడియారంలో సమయాన్ని ఒక గంట ముందుకు జరుపుతారు. దీనిని 'డేలైట్ సేవింగ్' అంటారు. మళ్లీ శీతాకాలం రాగానే ఆ గంటను వెనక్కి జరిపి పాత సమయాన్ని (ప్రామాణిక సమయం) అనుసరిస్తారు. మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో ప్రారంభమైన ఈ విధానం, ఆ తర్వాత రద్దయి, రెండో ప్రపంచ యుద్ధం (1942) సమయం నుంచి మళ్లీ అమల్లోకి వచ్చింది. ఆ తర్వాత 1969లో దీనికి చట్టబద్ధత కల్పించారు. (మిగతా 2లో...)

# నేరాలకు కేరాఫ్ 'అమ్మో'వారిపేట క్రాస్?

- కల్లు మండువలు, బెల్ట్ షాపులతో కిటకిట
- ఉర్సుగుట్ట రోడ్డు మొదలు అమ్మవారిపేట వరకు 'డేంజర్‌జోన్'!
- నిర్మానుష్య ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న మందుబాబులు
- సాయంకాల సమయంలో దొంగతనాలు, జంటలకు బెదిరింపులు
- మద్యం సేవించి క్రైంకు తెరలేపుతున్న కిరాతకులు
- నిర్మానుష్య ప్రాంతాల్లో భూ తగాదాలు, పంచాయతీలు
- భారీ వాహనాల రాకపోకలతో ప్రమాదాలు
- మిల్స్ కాలనీ, అటు మడికొండ పోలీసులకు తప్పని ఇక్కట్లు
- కనీస జాగ్రత్తలు పాటించని వరంగల్ బల్దియా అధికారులు
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ అధికారులు..??

పీపుల్స్‌డైరీ ప్రతినిధి, వరంగల్




వరంగల్ నగర శివారులో ఉర్సుగుట్ట నుంచి బట్టుపల్లి రూట్‌లోని రహదారి రోజురోజుకూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉర్సుగుట్ట నుంచి అమ్మవారిపేట కూడలి వరకు ఉన్న ప్రధాన రహదారిపై భారీ సంఖ్యలో క్రషర్, రెడీమిక్స్ లారీలు నిరంతరం రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు అధికంగా ఉన్న ఈ మార్గంలో ట్రాఫిక్ హెచ్చరిక బోర్డులు, భద్రతా ఏర్పాట్లు లేకపోవడం ప్రమాదాలకు కారణమవుతోందని చెబుతున్నారు.

రోడ్డుకు ఇరువైపులా అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన డబ్బా దుకాణాల ముసుగులో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా నడుస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉర్సుగుట్ట నుంచి అమ్మవారిపేట క్రాస్ వరకు పదుల సంఖ్యలో బెల్ట్‌షాపులు కొనసాగుతుండటంతో రోజూ పెద్ద సంఖ్యలో మద్యం సేవించే వారు అక్కడ గుమిగూడుతున్నట్లు సమాచారం. అర్ధరాత్రి వరకు మద్యం సేవించి మత్తులో తిరిగే కొందరు అసాంఘిక వ్యక్తులు రహదారిపై వెళ్తున్న వాహనాలను అడ్డగించి బెదిరింపులకు పాల్పడుతున్నారని, నగదు, బంగారు ఆభరణాలు దోచుకుంటున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు.

ఇటీవల ఈ ప్రాంతంలో దారిదోపిడీ, హత్యాయత్నం, దొంగతనాలకు సంబంధించిన కేసులు నమోదైన విషయం తెలిసిందే. మిల్స్‌కాలనీ పోలీసులు ఈ ఘటనలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నప్పటికీ, అక్రమ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు మరింత పెరుగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి.


ఈ ప్రాంతం మిల్స్‌కాలనీ, మడికొండ పోలీస్‌స్టేషన్‌ల సరిహద్దులో ఉండటంతో ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుందనే విషయంలో స్పష్టత లేకపోవడం కూడా సమస్యగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇదే పరిస్థితిని ఆసరాగా చేసుకుని అసాంఘిక శక్తులు రెచ్చిపోతున్నాయని అంటున్నారు. మరోవైపు, అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖ కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఇటీవల రైతు పొలం నుంచి అపహరణకు గురైన కాడెద్దులను మిల్స్‌కాలనీ పోలీసులు కేవలం రెండు రోజుల్లోనే స్వాధీనం చేసుకుని రైతుకు అప్పగించడం పోలీసుల పనితీరుపై విశ్వాసాన్ని పెంచిందని స్థానికులు అభినందిస్తున్నారు. అయితే అదే తరహాలో బట్టుపల్లి రహదారిపై కూడా రాత్రివేళల్లో ప్రత్యేక గస్తీ నిర్వహించి, దారిదోపిడీలు, అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాలని వారు కోరుతున్నారు.

అదేవిధంగా ట్రాఫిక్ పోలీసులు ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అధికారులు రహదారి పక్కన ఆక్రమణలు తొలగించి భద్రతా సూచనలు ఏర్పాటు చేయాలని, ఎక్సైజ్ శాఖ బెల్ట్‌షాపులపై ప్రత్యేక దాడులు నిర్వహించాలని ప్రజలు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత శాఖలు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టకపోతే ఈ ప్రాంతంలో నేరాలు మరింత పెరిగే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# జీవ వైవిధ్య రక్షకులు...

(మొదటి పేజీ తరువాయి)



తెలంగాణలో నాగుపాము, కట్లపాము (క్రైట్), రస్సెల్స్ వైపర్, సా-స్కేల్డ్ వైపర్ వంటి విషపూరిత పాములతో పాటు ఎలుకపాము, చెట్టుపాము, నీటిపాము వంటి హానికరం కాని పాములు కూడా విస్తారంగా కనిపిస్తాయి. ముఖ్యంగా వర్షాకాలంలో బిలాల్లోకి నీరు చేరడంతో ఇవి నివాస ప్రాంతాల్లోకి వచ్చే అవకాశం ఉంటుంది.

**పాము కనిపిస్తే ఏం చేయాలి?**

పాము కనిపించగానే భయంతో దానిని చంపేందుకు ప్రయత్నించకూడదు. ప్రశాంతంగా ఆ ప్రాంతానికి దూరంగా ఉండి, అటవీ శాఖ అధికారులు లేదా శిక్షణ పొందిన స్నేక్ రెస్క్యూ బృందాలకు సమాచారం ఇవ్వాలి. స్వయంగా పట్టుకునే ప్రయత్నం చేయడం ప్రమాదకరం.

**పాము కాటేస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

పాము కాటేస్తే గాయంపై కోయడం, విషాన్ని నోటితో పీల్చడం, గట్టిగా కట్టు కట్టడం వంటి పాత పద్ధతులు అనుసరించరాదు. బాధితుడిని ప్రశాంతంగా ఉంచి వీలైనంత త్వరగా సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలి. వైద్యుల సూచనల మేరకు యాంటీ స్నేక్ వెనం (ఏఎస్‌వీ) చికిత్స తీసుకోవడం ప్రాణాలను కాపాడుతుంది.

**మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలి**

పాములు పగ పెంచుకుంటాయి, మనుషుల ముఖాన్ని గుర్తుపెట్టుకుంటాయి, పగ తీర్చుకోవడానికి వెంబడిస్తాయి వంటి ప్రచారాలకు ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవు. చాలా సందర్భాల్లో పాములు ఆత్మరక్షణ కోసమే కాటు వేస్తాయి. అవి మనుషులపై కావాలనే దాడి చేయవు.

**పర్యావరణానికి పాముల సేవ**

ఆహార గొలుసులో పాములు కీలకమైన జీవులు. అవి ఎలుకలను నియంత్రిస్తే, గద్దలు, డేగలు, గుడ్లగూబలు వంటి అనేక జంతువులకు ఆహారంగా కూడా మారుతాయి. ఒక జీవి అంతరించిపోతే మొత్తం జీవవ్యవస్థపై ప్రభావం పడుతుంది. అందుకే పాముల సంరక్షణ అంటే ప్రకృతి సంరక్షణే.


**ప్రతి ఒక్కరి బాధ్యత**

వన్యప్రాణుల సంరక్షణ చట్టాల ప్రకారం పాములను చంపడం నేరం. ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించి, పాములను చంపకుండా రక్షించడం ద్వారా జీవ వైవిధ్యాన్ని కాపాడవచ్చు. అంతర్జాతీయ పాముల దినోత్సవం సందర్భంగా పాములపై ఉన్న అపోహలను వీడి, వాటి ప్రాముఖ్యతను గుర్తించడం ప్రతి ఒక్కరి బాధ్యత.

సర్పాలు చాలా తక్కువ ఆహారం తీసుకుంటాయి. ఒక్కసారి తింటే చాలా రోజుల వరకు ఆహారం లేకపోయినా సులభంగా జీవించగల అద్భుతమైన జీవక్రియ వీటి సొంతం. సహజ సిద్ధమైన అడవులలో ఉండే... జబ్బులు, వేటాడే ఇతర జంతువులు, వాతావరణ మార్పుల వంటి ముప్పులు ఏవీ కూడా జూ లో ఉండవు కాబట్టి ఇవి అక్కడ చాలా ఎక్కువ కాలం జీవించగలుగుతాయి. అటవీ ప్రాంతాలను రక్షించడం, మనుషులకు-పాములకు మధ్య ఘర్షణలను తగ్గించడం ద్వారా వీటిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వన్యప్రాణి నిపుణులు చెబుతున్నారు.

# 'డేలైట్ సేవింగ్'కు అమెరికా తెర

(మొదటి పేజీ తరువాయి)



అప్పటి నుంచి ఇప్పటివరకు అమెరికన్లు ఏటా రెండుసార్లు ఈ సమయాల మార్పుతో సతమతమవుతున్నారు. శాశ్వత మార్పు వల్ల లాభాలేంటి? ఈ మార్పును గట్టిగా సమర్థిస్తున్న ఫ్లోరిడా ప్రతినిధి గస్ బిలిరాకిస్ మాట్లాడుతూ.. ఏడాదికి రెండుసార్లు ఇలా సమయాన్ని మార్చడం వల్ల ప్రజల జీవనశైలి దెబ్బతింటోందని అన్నారు. ఈ విధానాన్ని శాశ్వతంగా ఉంచడం వల్ల సాయంత్రం వేళల్లో ప్రజలకు అదనంగా మరో గంట పగటి వెలుగు దొరుకుతుందని, దీనివల్ల వ్యాపారాలు పుంజుకోవడంతో పాటు పర్యాటక రంగానికి ఎంతో మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. శ్వేతసౌధం (వైట్ హౌస్) కూడా ఈ ప్రతిపాదనను స్వాగతించింది. ఇది ప్రజలందరికీ ఉపయోగపడే మంచి సంస్కరణ అని, బిల్లు తన వద్దకు వస్తే అధ్యక్షుడు ఖచ్చితంగా సంతకం చేస్తారని స్పష్టం చేసింది. అమెరికా ప్రజలు కూడా దాదాపుగా ఇదే కోరుకుంటున్నారు. ఇటీవల జరిగిన ఒక సర్వేలో 56 శాతం మంది ప్రజలు సాయంత్రం పూట అదనపు వెలుగునిచ్చే ఈ డేలైట్ విధానాన్నే శాశ్వతంగా ఉంచాలని కోరగా, కేవలం 40 శాతం మంది మాత్రమే పాత ప్రామాణిక సమయానికి మొగ్గు చూపారు.

# భవిష్యత్ బాట 'డేటా'

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరిస్తున్నారు. భారత్‌లో డేటా సెంటర్‌లు, ఏఐ మౌలిక సదుపాయాల విస్తరణ కేవలం నిర్మాణాత్మక అభివృద్ధి మాత్రమే కాదని, యువతకు ఇది గొప్ప ఉపాధి అవకాశాలను అందించే జాతీయ స్థాయి అవకాశం అని ఎన్‌ఎల్‌బీ సర్వీసెస్ సీఈవో సచిన్ అలుగ్ అన్నారు. దేశం డిజిటల్ పరివర్తన దిశగా వేగంగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, క్లౌడ్ ఆపరేషన్స్, ఆటోమేషన్, పవర్ సిస్టమ్స్, క్రిటికల్ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో నైపుణ్యం కలిగిన కొత్త తరహా ఉద్యోగుల కోసం భారీ డిమాండ్ ఏర్పడుతోందని ఆయన తెలిపారు. ఇది కేవలం ఉద్యోగాల భర్తీ మాత్రమే కాకుండా, భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థను రాబోయే దశాబ్దాల పాటు ముందుకు నడిపించే నైపుణ్యవంతులైన శ్రామిక శక్తిని తయారు చేయడమే లక్ష్యమని వివరించారు.

ముఖ్యంగా ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆపరేషన్స్ ఇంజినీర్లు, లిక్విడ్ కూలింగ్ ఇంజినీర్లు, ఎనర్జీ ఆప్టిమైజేషన్ స్పెషలిస్టులు, క్రిటికల్ ఫెసిలిటీస్ ఇంజినీర్లు, పవర్ సిస్టమ్స్ నిపుణులు వంటి ఉద్యోగాలు రాబోయే రోజుల్లో కీలకంగా మారనున్నాయి. తదుపరి తరం ఏఐ ఆధారిత డేటా సెంటర్లకు అధునాతన కూలింగ్ వ్యవస్థలు, శక్తి నిర్వహణ, కీలక మౌలిక సదుపాయాల సామర్థ్యాలు అవసరం కావడంతో ఈ ఉద్యోగాలకు మరింత ప్రాధాన్యం పెరుగుతోంది. డిజిటల్ ఇండియా, ఏఐ విప్లవం, క్లౌడ్ టెక్నాలజీ విస్తరణతో డేటా సెంటర్ రంగం రానున్న సంవత్సరాల్లో భారీ స్థాయిలో ఉద్యోగాలను సృష్టించే అవకాశం ఉందని

# 4వ బెటాలియన్‌లో ఆర్కెస్ట్రా ప్రదర్శన

**పీపుల్స్‌డైరీ-వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ 4వ బెటాలియన్‌లో నూతనంగా ఏర్పాటైన టీజీఎస్పీ ఆర్కెస్ట్రా బృందం తమ సరికొత్త స్వరాలతో శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది. బెటాలియన్ ఆవరణలో ఏర్పాటు చేసిన తమ సంగీత ప్రదర్శనలో ఈ ఆర్కెస్ట్రా బృందం మధుర గీతాలను ఆలపించారు. తమ అద్భుతమైన గానంతో, వాయిద్యాల మేళవింపుతో బెటాలియన్ అధికారులు, సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యులు మైమరచిపోయారు. కార్యక్రమం ప్రారంభం నుండి ముగింపు వరకు ఆర్కెస్ట్రా బృందం సభ్యులు ఎనర్జిటిక్ పర్ఫార్మెన్స్‌తో అలరించారు. నూతన, పురాతన సినీ మధుర గీతాలను ఆలపిస్తూ, దానికి తగ్గట్టుగా వాయిద్యాలను వాయిస్తూ అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. అతి తక్కువ కాలంలోనే శిక్షణ పూర్తి చేసుకుని, ఇంత ప్రొఫెషనల్ స్థాయిలో, అత్యంత ప్రతిభావంతంగా సంగీతాన్ని పలికించడంపై అక్కడికి విచ్చేసిన ప్రేక్షకులు ప్రశంసల జల్లు కురిపించారు. బెటాలియన్ లోని తెలుగు, ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు, పోలీసు సిబ్బంది పిల్లలు వెస్టర్న్, క్లాసికల్ పాటలకి అద్భుతంగా డాన్స్ చేసారు. ఈ సందర్భంగా 8వ బెటాలియన్ కమాండెంట్ ఎమ్.రామకృష్ణ మాట్లాడుతూ.. చాలా తక్కువ కాల వ్యవధిలో ఆర్కెస్ట్రా బృందం ఈ స్థాయి నైపుణ్యాన్ని ప్రదర్శించడంపై హర్షం వ్యక్తపరిచారు. పోలీసుల విధుల్లో ఉండే ఒత్తిడిని దూరం చేయడానికి, సిబ్బంది మానసిక ఉల్లాసానికి ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో 4వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్స్ కె. బాలయ్య,ఈ.వీరన్న, జె.రాజేందర్, ఆర్ఐలు విజయ్, కార్తీక్, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్,రాంప్రసాద్,కృష్ణ మరియు అధికారులు, పోలీస్ సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.










# తలకిందులైన ఆఫీస్ మార్కెట్

(మొదటి పేజీ తరువాయి)

కాలంగా వేగంగా పుంజుకుంటున్న సంగతి తెలిసిందే. హైదరాబాద్, ఢిల్లీ, పుణె సహా పలు నగరాల్లో వృద్ధి వేగంగా కనిపిస్తోందని రిపోర్ట్స్ వస్తున్నాయి. అయితే ఇక్కడ నివాస గృహాల సంగతి పక్కనబెడితే ఇప్పుడు కార్యాలయ స్థలాలకు (ఆఫీస్ స్పేస్) డిమాండ్ గురించి చూద్దాం. దేశంలోనే కార్యాలయ స్థలాల లీజింగ్‌లో అతిపెద్ద మార్కెట్ అయిన బెంగళూరులో గిరాకీ ఈ ఏడాది జనవరి- జూన్ సమయంలో భారీగా తగ్గింది. 2025 జనవరి- జూన్ సమయంలో బెంగళూరులో ఆఫీస్ స్పేస్ లీజింగ్ 117.9 లక్షల చదరపు అడుగులుగా ఉంటే ఇప్పుడు అది 93.7 లక్షల చ.అడుగులకు పరిమితమైంది. ఇక్కడ ఏకంగా 21 శాతం పతనం కనిపించింది. అతిపెద్ద మార్కెట్లో ఈ పతనం ఆందోళన కలిగిస్తోంది. ఈ మేరకు రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ జేఎల్ఎల్ ఒక రిపోర్ట్ విడుదల చేసింది.

హైదరాబాద్ నగరంలో చూస్తే గతేడాది తొలి 6 నెలల కాలంలో 45.8 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాల స్థూల లీజింగ్ జరిగింది. ఇదే ఇప్పుడు 53.8 లక్షల చదరపు అడుగులకు చేరుకుంది. ఇక్కడ చూస్తే అంతకుముందు ఇదే సమయంతో పోలిస్తే 18 శాతం వృద్ధి కనిపించింది.

ఇక దేశంలోని 7 ప్రధాన నగరాల్లో కలిపి చూస్తే ఈ ఏడాది తొలి అర్ధభాగంలో 379 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ లీజుకు వెళ్లింది. అంతకుముందు ఇదే సమయంతో పోలిస్తే స్వల్పంగా 4 శాతం మేర తగ్గింది. అంతర్జాతీయంగా అనిశ్చితి ఉండటం, వివిధ రంగాల్లో ఏఐ సాంకేతికత ఆధారితంగా మార్పులు చెందుతుండటం వంటి అంశాల్ని పరిగణనలోకి తీసుకొని, కొత్త స్థలాల్ని లీజుకు తీసుకోవడంలో ఆయా సంస్థలు అప్రమత్తతతో వ్యవహరించాయి.

# 'సర్' గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

అధికారికంగా విడుదల చేయనున్నారు. ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత కొత్తగా ఓటు నమోదు, పేరు సవరణ, మార్పులు, అభ్యంతరాల స్వీకరణకు ఆగస్ట్ 10వ తేదీ నుంచి సెప్టెంబర్ 9వ తేదీ వరకు గడువు కల్పించారు. ఈ దరఖాస్తులపై విచారణ, నోటీసుల జారీ, పరిష్కార ప్రక్రియను అక్టోబర్ 8వ తేదీ నాటికి పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అన్ని ప్రక్రియలు పూర్తయ్యాక అక్టోబర్ 12వ తేదీన తుది ఓటర్ల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ చాలా నెమ్మదిగా సాగుతోందని కాంగ్రెస్, బీఆర్ఎస్ సహా పలు రాజకీయ పార్టీలు ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాయి. కొన్ని ప్రాంతాల్లో ఇంకా ఎన్యుమరేషన్ ఫారాలు కూడా అందలేదని.. అందుకే ఎస్ఐఆర్ గడువు పెంచాలని చేసిన విజ్ఞప్తితో కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్త షెడ్యూల్‌ను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని.. రాజకీయ పార్టీలకు లిఖితపూర్వకంగా సమాచారం అందించాలని రాష్ట్ర ఎన్నికల అధికారులను ఈసీ ఆదేశించింది.

అయితే.. ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టం చేసినట్లు.. ఎస్ఐఆర్ ప్రక్రియలో అవసరమైన ఫారాలు సమర్పించకపోతే లేదా వివరాలు నమోదు చేయకపోతే ఓటరు జాబితాలో సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కాబట్టి అర్హులైన ప్రతి ఓటరు నిర్ణీత గడువులోపు వివరాలను ధృవీకరించి అవసరమైన ఫారాలను సమర్పించాలని ఎన్నికల సంఘం అధికారులు సూచిస్తున్నారు.

# నిరీక్షణకు చెక్!

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ప్రముఖ ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌తో జతకట్టినట్టు సమాచారం. ఈ ఒప్పందంలో భాగంగా ఆన్ డిమాండ్ ఎల్‌పీజీ సిలిండర్ డెలివరీ సేవలను అధికారికంగా లాంచ్ చేసింది. దేశంలోనే ఇలాంటి సర్వీస్ రావడం ఇదే తొలిసారి. సాధారణంగా ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ బుక్ చేస్తే 24 నుంచి 48 గంటల సమయం పడుతుంది. కానీ స్విగ్గీ- హెచ్‌పీసీఎల్ పార్ట్నర్‌షిప్‌తో రూపురేఖలు మారనున్నాయి. ప్రాథమికంగా ఈ సర్వీస్ కింద వాణిజ్య, గృహ అవసరాలకు ఉపయోగపడే 5 కిలోల ఎఫ్‌టీఎఫ్ సిలిండర్లను అలాగే రెగ్యులర్ కనెక్షన్ రీఫిల్‌ను క్విక్ కామర్స్ డెలివరీ నెట్‌వర్క్ పరిధిలోకి తీసుకురానున్నారు. వంట మధ్యలో గ్యాస్ అయిపోయి ఇబ్బంది పడే గృహిణులు, ఒంటరిగా ఉండే బ్యాచిలర్స్, చిన్న హోటల్ వ్యాపారులను టార్గెట్ చేస్తూ ఈ కొత్త సేవలను డిజైన్ చేశారు.

ఈ మేరకు స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ మంగళవారం రోజున ఓ ప్రకటన చేసింది. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌తో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా దేశంలోనే తొలి ఆన్-డిమాండ్ ఎల్‌పీజీ సిలిండర్ డెలివరీ సర్వీసును క్విక్ కామర్స్ ప్లాట్ ఫారమ్‌లోకి తీసుకొస్తున్నట్లు తెలిపింది. హెచ్‌పీసీఎల్ ఇటీవలే లాంచ్ చేసిన హెచ్‌పీ నవ్య అనే నెక్స్ట్ జనరేషన్ 10కేజీ కాంపోజిట్ ఎల్‌పీజీ సిలిండర్‌ను సైతం డెలివరీ చేయనున్నారు.

**బెంగళూరులో ఫస్ట్**

అయితే, ఈ క్విక్ కామర్స్ సిలిండర్ డెలివరీ సేవలు ముందుగా బెంగళూరు నగరంలో అందుబాటులోకి రానున్నాయి. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ యాప్ నుంచి కస్టమర్లు హెచ్‌పీ నవ్యా (న్యూ ఛీఖజఖు) సిలిండర్లను ఆర్డర్ చేసుకోవచ్చు. 5కిలోల మెటల్ ఎల్‌పీజీ సిలిండర్‌తో పాటు 10 కేజీల సిలిండర్ సైతం ఆర్డర్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు.

# ముద్రగడ మృతి పట్ల మున్నూరు కాపు సంఘం ఘన నివాళి

## ఆయన ముందుకు తీసుకెళ్తామన్న చిన్న శెట్టి సత్యనారాయణ



**దమ్మపేట, జులై 15(పీపుల్స్ డైరీ) :** కాపు సమాజ హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడిన మాజీ మంత్రి, కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం మృతి పట్ల దమ్మపేట మండల మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు చిన్న శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ, ముద్రగడ పద్మనాభం కాపు సమాజానికి మార్గదర్శిగా నిలిచారని, ఆయన మరణం కాపు సమాజానికి తీరని లోటని అన్నారు. కాపు సామాజిక, రాజకీయ హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. కాపు యువతకు ఆత్మవిశ్వాసాన్ని నింపిన నాయకుడిగా, సామాజిక న్యాయం కోసం అహర్నిశలు శ్రమించిన మహానుభావుడిగా ముద్రగడ పద్మనాభాన్ని గుర్తు చేసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని దేవుడు ప్రసాదించాలని ప్రార్థించారు.

ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం పెద్దలు చిన్న శెట్టి యుగంధర్, చిన్న శెట్టి చిట్టిబాబు, చిన్న శెట్టి గోపి, పగడాల రాంబాబు, పానకాల సత్యనారాయణ, కోరుకొండ భాస్కరరావు, చెవ్వ వెంకట్, మేకల రమేష్, జంగాల పుల్లారావు, ఏలూరి సత్తిబాబు, సుధాపల్లి నాగరాజు, చిన్నశెట్టి చినబాబు తదితరులు పాల్గొని ముద్రగడ పద్మనాభం సేవలను కొనియాడారు.

పీపుల్స్‌డైరీ
వరంగల్
గురువారం, 16 జూలై 2026

సంపుటి : 18, సంచిక : 129

# వంగరలో ఘనంగా ముదిరాజ్ కులస్థుల వనభోజనాలు



**భీమదేవరపల్లి, జూలై 15 (పీపుల్స్ డైరీ):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో ముదిరాజ్ కులస్థుల వనభోజన మహోత్సవం బుధవారం అత్యంత కోలాహలంగా,భక్తిశ్రద్ధలతో జరిగింది.కార్తీక మాస పర్వదినాన్ని పురస్కరించుకుని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వనభోజన కార్యక్రమానికి గ్రామ పరిధిలోని ముదిరాజ్ కుటుంబాలు భారీ సంఖ్యలో తరలివచ్చాయి.ఉదయాన్నే గ్రామ శివారులోని పచ్చని చెట్ల నీడన చేరిన ముదిరాజ్ కులస్థులు ముందుగా పెద్దమ్మ తల్లి, ముత్యాలమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మహిళలు ఆటపాటలతో, మంగళ హారతులతో సందడి చేశారు. చిన్నపెద్ద తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా వివిధ ఆటల్లో పాల్గొని రోజంతా ఆహ్లాదకరంగా గడిపారు.ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఏనుక శ్రీనివాస్ మాట్లాడు తూ... సమాజంలో కుల బాంధవ్యాలను బలపరచడానికి, అందరి మధ్య ఐక్యతను పెంపొందించడానికి ఇటువంటి వనభోజన కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఒకే చోట చేరి అందరూ కలిసి వండుకుని, సహపంక్తి భోజనాలు చేయడం వల్ల కుటుంబాల మధ్య బంధాలు మరింత బలపడతా యన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం కార్యదర్శి ఎంగల నారాయణ, డైరెక్టర్ ఏనుక కిషన్, సంఘం పెద్దలు అయిల వేని సమ్మయ్య, ఎంగల పోషన్న, ఎంగల రమేష్, ఎంగల అఖిల్, నీలం ప్రవీణ్, రజినీకాంత్, కార్యవర్గ సభ్యులు, యువకులు, మహిళలు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు.

# కిషన్ రెడ్డి గత చరిత్రను తెలుసుకొని మాట్లాడాలి

- మాకు రాజకీయాలు ముఖ్యం కాదు...రైతుల ప్రయోజనాలే ముఖ్యం...
- సింగరేణి భరోసా యాత్ర ఎవరికోసం...?
- కార్మికుల కోసమా... సంస్థ కోసమా...? మీ రాజకీయాల కోసమా..?
- నువ్వు చేసేది సింగరేణి భరోసా యాత్ర కాదు.. కాంగ్రెస్ కు బ్రతుకు తెరువు నీచ్చే యాత్ర.
- కాళేశ్వరం ప్రాజెక్ట్ మోటార్లు ఆన్ చేయండి, రైతులకు నీళ్ళు ఇవ్వండి.
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి...



**భూపాలపల్లి జూలై 15 పీపుల్స్ డైరీ :** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, టి బి జి ఏకే ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, టి బి జి ఏకే ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మంగళవారం గేట్ మీటింగ్ లో మాట్లాడిన తీరు హాస్యస్పదంగా ఉంది గత ఐదేళ్లు పర్యాటక మంత్రి, ఇప్పుడు కోల్ మినిస్టర్ గా ఉండి తెలంగాణకు ఒరుగబెట్టింది ఏమిటో తెలపాలన్నారు. గతంలో బిఆర్ఎస్ పార్టీ, టీబీజీకేఎస్ అధికారంలో ఉన్నప్పుడు సింగరేణి విషయంలో కేంద్ర ప్రభుత్వం విధానాలు చూస్తే సింగరేణి అందకారంలోకి పోతుందని తమ పార్టీ ఎమ్మెల్యేలం, మంత్రులం అంతా కలిసి బొగ్గు బ్లాక్ లన్నీ సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ కలిసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక ధర్నాలు రాస్తారోకోలు చేశామన్నారు. సింగరేణికి తాడిచర్ల-2 గని కేటాయించామని గొప్పలు చెప్పుకుంటున్నావా.అది గతంలోనే సింగరేణికి కేటాయించిన సంగతి తెలుసుకోవాలన్నారు. 2013లో కేటాయించిన ఆ బొగ్గు బ్లాక్ ను కేసీఆర్ పదేళ్ల కాలంలో ఆ ఫైళ్లను ప్రైవేటుపరం కాకుండా పెండింగ్లో పెట్టడం ద్వారా నేడు అది సింగరేణికి దక్కిందన్నారు.గత 16 నెలల కాలంగా సింగరేణిలో రెగ్యులర్ మెడికల్ బోర్డు లేదని, 3,000 మంది కార్మికులు మెడికల్ బోర్డు కోసం వెయిట్ చేస్తున్నారని, వారందరికీ మెడికల్ బోర్డు నిర్వహించి 100శాతం అన్ ఫిట్ చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న డిపెండెంట్ లందరికీ ఉద్యోగాలు ఇస్తే భరోసా ఇచ్చినట్లే. సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావలసిన రూ. 54 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించేలా చూడాలి. సింగరేణిలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అవినీతిని అరికడతనని కార్మికుల మనోధైర్యాన్ని ఇచ్చారా...? బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం సింగరేణి భరోసా యాత్రను నిర్వహిస్తున్నావు...? తప్ప కార్మికుల ప్రయోజనాల కోసం కాదు. సింగరేణినీ కేసీఆర్ దోచుకుతిన్నాడు అనడం సిగ్గు చేటు. కెసిఆర్ పాలనలో సింగరేణి కార్మికులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సీఎం పదవి చేపట్టిన కేసీఆర్ సింగరేణి సంస్థలు కాపాడుకోవాలని లక్ష్యంతో కార్మికులకు 32శాతం లాభాల వాటను ఇచ్చాడనీ, బీఆర్ఎస్ హయాంలో రామప్ప కాలనీలో కార్మికుల కుటుంబాలు నివసించడానికి 2వేల డబుల్ బెడ్ రూములు, నిర్మించామన్నారు. కేంద్ర మంత్ర కిషన్ రెడ్డి నువ్వు కేటీకే-8 ఇంక్లైన్ కు నిన్న పోయావు కదా...? రామప్ప కాలనీ నీకు కనబడలేదా...? అదేవిధంగా సింగరేణి కార్మికుల కోరిక మేరకు ఇంటింటికి గోదావరి శుద్ధ జనాలను అందించింది బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్న విషయాన్ని గుర్తుంచుకో..! కిషన్ రెడ్డి గత చరిత్రను తెలుసుకొని మాట్లాడాలి. ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును చదివి, నిజాయితీపరులపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరైనది కాదు. బొగ్గు లారీలు పోవడానికి "వన్ వే" అని అంటున్నావు. నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జిల్లా కేంద్రంలో వన్ వే ద్వారా ట్రాఫిక్ సమస్య ఉందని గ్రహించి, నేను బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ. 130 కోట్ల నిధులు మంజూరు చేపించి, భూ సర్వే కూడా చేపించాను. ఈ విషయం మీ బిజెపి నాయకులకు తెలియదా...? కిషన్ రెడ్డి నిజ నిజాలు తెలుసుకొని మాట్లాడు. కెసిఆర్ 10 ఏండ్ల పాలనలో రూ. 25 వేలకోట్ల అప్పు చేశాడని అంటున్నావు. మరి నీ ఆప్తమిత్రుడు రేవంత్ రెడ్డి వచ్చిన రెండున్నర ఏండ్లలోనే రూ.30వేల కోట్లకు పైగా అప్పు చేశాడు. దాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదు. బిజెపి, కాంగ్రెస్ లు దొందు దొందేనన్నారు. బిజెపి కొత్తగా తీసుకువచ్చిన లేబర్ కోడ్ లపై కార్మికులు నిన్ను మీటింగ్ లో ప్రశ్నిస్తే... వాళ్లకు నువ్వు ఏం సమాధానం చెప్పావో చెప్పు. నీ దగ్గర సరైనా సమాధానం లేక...నీ ఉనుకదంపుడు మాటలు చెప్పి అవుతలపడ్డావు. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క లు నీ ఆప్త మిత్రులే కదా... దమ్ముంటే వాళ్లతో మాట్లాడి ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్నా మెడికల్ బోర్డును నిర్వహించేలా చూడు. గాలి, గారడి మాటలు మాట్లాడి వెళ్లిపోతే కార్మికులు బిజెపి, కాంగ్రెస్ లను నమ్మరన్నారు. నువ్వు చేసేది సింగరేణి భరోసా యాత్ర కాదని, కాంగ్రెస్ కు బ్రతుకు తెరువును చూపిస్తున్న యాత్ర అని స్పష్టంగా కార్మికులకు అర్థమవుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ యొక్క పంపులను ఆన్ చేసి రైతులకు నీళ్ళు ఇవ్వండి.పంపులు ఆన్ చేస్తే ప్రాజెక్ట్ కి ఏమైనా జరిగిన మా బిఆర్ఎస్ పార్టీ 28 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి మళ్ళీ రాజకీయాలు చెయ్యం అని సవాలు విసిరితే ఒక్కరూ కూడా సవాలు స్వీకరించలేదు. మాకు రాజకీయాలు ముఖ్యం కాదు మాకు రైతుల ప్రయోజనాలు ముఖ్యం అని తెలిపారు.

# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే సమగ్ర భూ సర్వే





## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**భూపాలపల్లి జూలై 15 పీపుల్స్ డైరీ..** భూపాలపల్లి మండలంలోని ఎస్.ఎం. కొత్తపల్లి గ్రామంలో భూ సర్వేపై నిర్వహించిన గ్రామసభలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల్లో భూములు సాగు చేస్తున్న వారు ఒకరైతే, పట్టా పాస్ పుస్తకాలు మరొకరి పేరుపై ఉండటం వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలంటే సమగ్ర భూ సర్వే తప్పనిసరిగా నిర్వహించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు గ్రామ ప్రజలను సమన్వయం చేసుకొని పారదర్శకంగా భూ సర్వే నిర్వహించాలని సూచించారు. వాస్తవంగా భూములను సాగు చేసుకుంటున్న అర్హులైన రైతులను గుర్తించి, నిబంధనల ప్రకారం వారికి పట్టాలు, పట్టాదారు పాస్ పుస్తకాలు అందించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.అదేవిధంగా రెవెన్యూ భూములు, గ్రామకంఠం భూములు, ప్రభుత్వ భూములపై ఉన్న ఆక్రమణలను గుర్తించేందుకు భూ సర్వే ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావడం కూడా ఈ సర్వే ద్వారా సులభతరం అవుతుందని తెలిపారు. రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అత్యంత ముఖ్యమని, పాస్ పుస్తకాలు ఉంటే పంట రుణాలు, రైతు భరోసా మరియు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇతర రైతు సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. అర్హులైన రైతులకు భూ పట్టాలు, పాస్ పుస్తకాలు అందించే విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ఆర్డీవో, తహసీల్దార్, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య బలోపేతమే లక్ష్యం -వేగవంతంగా సార్ ఎన్యుమరేషన్ ఫారాల భర్తీ



**ఏటూరునాగారం, జూలై 15 ( పీపుల్స్ డైరీ) :** మంత్రి ధనసరి అనసూయ డాక్టర్ సీతక్క ఆదేశాల, ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనల మేరకు ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఏటూరునాగారంలోని ఓడవాడ 45వ బూత్ పరిధిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ సార్ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల భర్తీ కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతోంది.బూత్ లెవెల్ అధికారి అంగన్‌వాడీ టీచర్ లలిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవెల్ ఏజెంట్లు లు చురుకుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 100 శాతం ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించేందుకు ప్రతి అర్హ ఓటరు సహకరించాలని కోరారు. ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, ప్రతి ఒక్కరూ సార్ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పిస్తూ, అవసరమైన సార్ ఎన్యుమరేషన్ ఫారాలను నింపించి సంబంధిత అధికారులకు అం దజేశారు. దీంతో బూత్ పరిధిలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్‌పర్సన్ కర్ల అరుణ, ఏటూరునాగారం కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు బి ఎల్ ఏ .కే. రంజిత్, బి ఎల్ ఎ.సూపర్‌వైజర్ గంపల శివకుమార్, బి ఎల్ ఎ లు. దుర్గం దుర్గారావు, కంకనల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి పై పిటిషన్..

## సీఐ కి ఫిర్యాదు చేసిన మాజీ ఎమ్మెల్యే గండ్ర...



**భూపాలపల్లి జూలై 15 పీపుల్స్ డైరీ..** హైదరాబాద్ లో నిర్వహించిన ప్రెస్మీట్ కార్యక్రమంలో రాష్ట్రంలో రాబోయే సూపర్ ఎల్ నినో మరియు కరవు పరిస్థితులపై ప్రభుత్వం ఎలాంటి ఏర్పాట్లు చేస్తోందని ఒక జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు బహిరంగంగా సమాధానం ఇస్తూ....ఈ కరవు సమస్య తీరాలంటే ప్రతిపక్ష నాయకులు కె. చంద్ర శేఖర్ రావు,తన్నీరు హరీష్ రావు , కేసీఆర్ కుటుంబ సభ్యులు మరియు రైతుల రక్తాన్ని తెలంగాణ పొలాల్లో చిందించడానికి కూడా నేను సిద్ధమే" అని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, ఈ ప్రతిపక్ష నాయకులు "తమ ఒంటికి బండరాయి కట్టుకుని కాళేశ్వరం ప్రాజెక్టులో దూకి చావాలి,అప్పుడే తెలంగాణకు వీరి నుండి శాశ్వతంగా విముక్తి లభిస్తుంది" అని అత్యంత ప్రత్యక్షంగా, బహిరంగంగా మీడియా సాక్షిగా ఒక్క ముఖ్యమంత్రి మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఈ రోజు భూపాలపల్లి పోలీస్ స్టేషన్ కి వెళ్ళి స్టేషన్ హౌజ్ ఆఫీసర్ ని స్వయంగా కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై కేసు నమోదు చేయాలంటూ ఫిర్యాదు చేసిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి వారి వెంట టి బి జి ఏకే ఎస్,అధ్యక్షుడు మిర్యాల రాజీరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# సామాజిక సేవలకు గుర్తింపుగా అడ్వకేట్ చి. వీరస్వామికి నేషనల్ అంబేద్కర్ అవార్డు



**శంకరపట్నం జులై:15 పీపుల్స్ డైరీ:** మండలానికి చెందిన సీనియర్ న్యాయవాది, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం నాయకుడు అడ్వకేట్ చి. వీరస్వామికి సామాజిక సేవలకు గుర్తింపుగా నేషనల్ అంబేద్కర్ అవార్డు ప్రదానం చేశారు. జన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అకాడమీ జాతీయ అధ్యక్షుడు డా. పాముల రమణ సమక్షంలో మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య చేతుల మీదుగా ఈ అవార్డును అందజేశారు.అనగారిన వర్గాల అభ్యున్నతి, అంబేద్కర్ యువజన సంఘాల బలోపేతం, పేదలకు న్యాయ సహాయం అందించడం, అలాగే ప్రజాప్రతినిధిగా మరియు మార్కెట్ కమిటీ పదవుల్లో విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేశారు. అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో మరింత సేవా కార్యక్రమాలు చేపడతానని వీరస్వామి తెలిపారు. ఈ సందర్భంగా మిత్రులు, శ్రేయోభిలాషులు, గ్రామ ప్రజలు ఆయనకు అభినందనలు తెలిపారు.

# శంకర ఐ హాస్పిటల్ లో విజయవంతమైన కంటి శస్త్రచికిత్సలు



**ఏటూరునాగారం జులై 15 (పీపుల్స్ డైరీ ) :** మండల కేంద్రంలోని శ్రీ సాయిబాబా దేవాలయంలో దేవాలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ కుమారుడు పెండ్యాల పవన్ కుమార్ జన్మదిన సందర్భంగా ఆదివారం నిర్వహి ంచిన ఉచిత కంటి పరీక్షల శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో ఎంపికైన 80 మందిని ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌లోని శంకర ఐ హాస్పిటల్‌కు తరలించగా, సోమవారం 26 మందికి, మంగళవారం 47 మందికి కలిపి మొత్తం 73 మందికి విజయవంతంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు దేవాలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పెండ్యాల ప్రభాకర్ సూచన మేరకు సినీ నటుడు, సంజోష్ ఫౌండేషన్ చైర్మన్ హీరో సంజోష్ శంకర ఐ హాస్పిటల్‌ను సందర్శించి శస్త్రచికిత్స చేయించుకున్న రోగులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి పండ్లు పంపిణీ చేయడంతో పాటు, అవసరమైన కంటి అద్దాలను కూడా ఉచితంగా అందజేస్తానని హామీ ఇచ్చారు.ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన శంకర ఐ హాస్పిటల్ వైద్య బృందానికి, సంజోష్ ఫౌండేషన్‌కు, రాహుల్ ఐ ఫౌండేషన్ సిబ్బందికి అలాగే సేవాభావంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ పెండ్యాల ప్రభాకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# హలో కార్మిక.. చలో బాచుపల్లి..

## బాచుపల్లి బొల్లారం చౌరస్తాలో నిర్వహిస్తున్న బహిరంగ సభను విజయవంతం చేయాలి

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జులై 15 :** కనీస వేతనాల జీవో అమలు, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సీఐటీయూ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ సాయంత్రం 4:00 గంటలకు ఐడీఏ బాచుపల్లి బొల్లారం చౌరస్తాలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం బాచుపల్లిలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ బాచుపల్లి మండల కన్వీనర్ రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కనీస వేతనాల జీవోను అన్ని పరిశ్రమల్లో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు చట్టబద్ధమైన కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ తదితర హక్కులు కల్పించాలని, యాజమాన్యాల వేధింపులను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ భారీ బహిరంగ సభకు పరిశ్రమల కార్మికులు, కర్షకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కమిటీ సభ్యులు పి. స్వామి, నరసింహ, ఎల్లమ్మ, లక్ష్మి, శీను, అంజి, మౌనిక, అలివేలు తదితర కార్మికులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ సత్య ప్రసాద్



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూలై 15 :** జగిత్యాల జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను మరింత మెరుగుపర్చేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సబ్జెక్టుల వారీ వృత్యంతర శిక్షణా కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని జ్ఞాన హైస్కూల్లో ఆంగ్లం సబ్జెక్టుకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించిన కలెక్టర్, శిక్షణ నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ (ఆర్‌పీ) బోధనను తరగతి గదిలో కూర్చొని ప్రత్యక్షంగా వీక్షించి, ముఖ్యంగా కృత్రిమ మేధ (అర్టిఫిషల్ ఇంటలిజెన్స్ -- ఏఐ) ను తరగతి గదిలో విద్యార్థుల అభ్యాసానికి ఎలా సమర్థవంతంగా వినియోగించుకోవచ్చనే అంశంపై అందించిన శిక్షణను ఆసక్తిగా పరిశీలించారు. ఆంగ్ల భాష బోధనలో స్పోకెన్ ఇంగ్లీష్, విద్యార్థి-కేంద్రిత బోధనా పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, కృత్రిమ మేధ ఆధారిత బోధనా విధానాలపై ఉపాధ్యాయులకు సమగ్ర శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ శిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని ప్రతి ఉపాధ్యాయుడు తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు, సృజనాత్మకత, ఆలోచనా సామర్థ్యాలను పెంపొందించడంలో ఆధునిక బోధనా విధానాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఇటువంటి శిక్షణా అవకాశాలను ప్రతి ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు, రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న మున్సిపల్ చైర్మన్



**జమ్మికుంట జులై 15 పీపుల్స్ డైరీ :** జమ్మికుంట పాత మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ఆధ్వర్యంలో పశువైద్యాధికారి రాజ్ కుమార్ పర్యవేక్షణ లో గోవు ప్రసవం ఇట్టి సందర్భంగా మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ముఖ్య గమనిక జమ్మికుంట పట్టణంలోని కొంతమంది గోవుల యజమానులు తమ ఆవులను రోడ్లపై వదిలివేస్తుండటంతో రోడ్లపైనే ప్రసవాలు జరగడం, రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోవడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలగడం వంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు జమ్మికుంట మున్సిపాలిటీ, పశుసంవర్ధక శాఖ వెటర్నరీ వైద్యుల ఆధ్వర్యం లో గో సంరక్షణ కార్యక్రమంలో భాగంగా రోడ్లపై ఉన్న నాలుగు గోవులకు సురక్షిత ంగా ప్రసవాలు నిర్వహించడం జరిగింది. ఇలాంటి పరిస్థితులు ఎంతో బాధాకరమైనవి.అందువల్ల గోవుల యజమానులందరూ 7 రోజులలోపు తమ ఆవులను తప్పనిసరిగా తీసుకెళ్లి సంరక్షించుకోవాలని ఆదేశించడమైనది లేనిపక్షంలో రోడ్లపై గోవులను వదిలివేసే యజమానులపై మున్సిపల్ చట్టాల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు కూడా విధించబడతాయి తెలిపారు.

## సమృద్ధిగా వర్షాలు కురవాలని రుద్రాభిషేకం -- హోమం



**వీణవంక, జూలై 16( పీపుల్స్ డైరీ) :** మండలంలోని బేతిగల్ గ్రామంలో శ్రీ శివాలయంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగానికి పవిత్ర జలాలతో రుద్రాభిషేకం నిర్వహించి, అనంతరం హోమ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. పూజా కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పరమేశ్వరుడిని ప్రార్థించారు. రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు భక్తిపూర్వకంగా పాల్గొని పూజలను విజయవంతం చేశారు. సర్పంచ్ సారమ్మ సారయ్య, ఉపసర్పంచ్ మడ్డి మహేష్ వార్డు సభ్యులు ధనలక్ష్మి తడిగోప్పుల సతీష్ ప్రవీణ్ ,సుజాత కృష్ణవేణి, అనూష, పల్లెర్ల మహేష్, రంజిత్ ,రాకేష్ గ్రామ ప్రజలు పాల్గొనారు

## రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధికార ప్రతినిధిగా నియమితులైన గోపాల్ రావుకు అభినందనలు

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జులై 15 :** ఇటీవల రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధికార ప్రతినిధిగా నియమితులైన గోపాల్ రావు ని మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేవైఎం కార్యదర్శి ఎస్. క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గోపాల్ రావు కి నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశాల్ (విక్కీ), కె. నాగేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# భూ సేకరణ విచారణ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..



**భూపాలపల్లి జూలై 15 పీపుల్స్ డైరీ..** తాడిచర్ల డేంజర్ జోన్‌లో భూ సేకరణ విచారణ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ నుండి డేంజర్ జోన్ పరిధిలోకి వచ్చే ప్రతి ఇంటిని తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. నిర్వాసితుల విచారణ కోసం ఐదు ప్రత్యేక టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి టీమ్‌కు నాయబ్ తహసీల్దార్ పర్యవేక్షణ ఉంటుందని, గిర్దావర్, సీనియర్ లేదా జూనియర్ అసిస్టెంట్, పంచాయతి కార్యదర్శి, గ్రామ పాలన అధికారి, జెన్కో ఏఈలు సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. ఎలాంటి వత్తిళ్లు, పైరవీలు లేకుండా విచారణను నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. డేంజర్ జోన్‌లోని ప్రతి ఇంటిని తనిఖీ చేసి చెక్‌లిస్ట్ ప్రకారం కుటుంబ వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని, ప్రతిరోజు పూర్తి చేసిన ఫారాలను కాటారం ఆర్డిఓ కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్వో వసంత కుమారి, డిపిఓ శ్రీలత, కాటారం ఆర్డిఓ రవీందర్, విద్యుత్ శాఖ డీఈలు పాపిరెడ్డి, జగదీష్, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసులు, మల్హర్ తహసీల్దార్ రవికుమార్, సర్వే టీము సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల సీట్ల కేటాయింపులో నిర్లక్ష్యానికి తావు లేదు..

- పేద విద్యార్థుల భవిష్యత్తే ప్రజాప్రభుత్వ లక్ష్యం
- దూర ప్రాంతాల నుంచి వచ్చే తల్లిదండ్రులతో మర్యాదగా వ్యవహరించి, సరైన మార్గదర్శనం చేయాలి..
- డీఎస్సీ భవన్‌లో (టీజీఎస్డబ్ల్యూఆర్ఐఈఎస్) కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి అడ్లూరి..



**హైదరాబాద్ బ్యూరో, జూలై 15 :** పేద, దళిత, గిరిజన విద్యార్థుల విద్యాభవిష్యత్తును తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ఒక్క విద్యార్థి కూడా గురుకుల విద్యకు దూరం కాకుండా అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ భారీగా నిధులు వెచ్చిస్తున్న నేపథ్యంలో, ఆ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు మరింత మానవీయ దృక్పథంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని డీఎస్సీ భవన్‌లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్డబ్ల్యూఆర్ఐఈఎస్) కార్యాలయాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి తమ పిల్లలకు గురుకులాల్లో ప్రవేశాలు కల్పించాలని వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల నుంచి మంత్రి స్వయంగా వినతిపత్రాలు స్వీకరించారు. ఒక్కొక్కరి సమస్యను ఓపికగా వింటూ వారి కుటుంబ పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు, పిల్లల చదువుపై ఉన్న ఆశయాలను అడిగి తెలుసుకున్నారు. దూర ప్రాంతాలు, మారుమూల గ్రామాల నుంచి వచ్చిన పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలకు సమీప జిల్లాల్లో సీట్లు కేటాయించాలని, ఇతర జిల్లాల్లో చదివించడం వల్ల రవాణా, ఆర్థిక ఇబ్బందులు ఎదు-రవుతున్నాయని మంత్రికి వివరించారు. వారి సమస్యలను విన్న మంత్రి స్పందిస్తూ, పేద కుటుంబాలకు చెందిన అర్హులైన విద్యార్థులకు సాధ్యమైనంత మేరకు వారికి అనుకూలమైన జిల్లాల్లో సీట్లు కేటాయించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జాయింట్ సెక్రటరీ (అడ్మినిస్ట్రేషన్) సక్రు నాయక్కు మంత్రి పలు కీలక సూచనలు చేశారు. సీట్ల కేటాయింపు ప్రక్రియలో పారదర్శకత, మానవీయ దృక్పథం, విద్యార్థుల సంక్షేమం ప్రధాన ప్రమాణాలుగా ఉండాలని, ప్రతి అర్జీని నిబంధనల పరిధిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి విద్యార్థికి న్యాయం చేయాలని ఆదేశించారు. అలాగే మారుమూల గ్రామాలు, దూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వచ్చే తల్లిదండ్రులు, సంరక్షకులు, బంధువులతో అధికారులు, సిబ్బంది అత్యంత మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. వారికి స్పష్టమైన సమాచారం అందిస్తూ, అవసరమైన మార్గదర్శకత్వం ఇవ్వాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులకు గురి చేయరాదని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దళిత, గిరిజన విద్యార్థుల విద్యా అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ భారీ స్థాయిలో నిధులు కేటాయించి గురుకుల విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్న సమయంలో, క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం లేదా అలసత్వానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ లక్ష్యాలను ప్రతి అధికారి తన బాధ్యతగా భావించి పనిచేయాలని, ప్రజల పట్ల సానుభూతితో వ్యవహరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం, ఆధునిక మౌలిక వసతులు, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఆ లక్ష్యాల సాధనలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. గురుకులాల్లో ప్రవేశాల కోసం వచ్చిన తల్లిదండ్రులు తమ సమస్యలను స్వయంగా విని వెంటనే స్పందించిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు మంత్రి చూపుతున్న చొరవను వారు అభినందించారు. చివరగా మంత్రి. అడ్లూరి మాట్లాడుతూ "పేద విద్యార్థి చదువు ఆగకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత. దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించేలా అవసరమైన ప్రతి సహాయాన్ని ప్రజా ప్రభుత్వం అందిస్తుంది. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు కూడా అదే నిబద్ధతతో పనిచేయాలి" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధింత అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జూలై 31లోగా నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి


- జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్
- నవంబర్ 28న జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్..



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూలై 15:** జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో 2027-28 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్ (జెఎన్వీఎస్టీ --2027) కు జిల్లాలోని అర్హులైన ఐదో తరగతి విద్యార్థులు జూలై 31, 2026లోగాఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఎయిడెడ్, గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తుల సమర్పణకు జూలై 31, 2026 చివరి తేదీ కాగా ప్రవేశ పరీక్ష 2026 నవంబర్ 28న నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి అర్హులైన విద్యార్థికి ఈ ప్రవేశ పరీక్షపై పూర్తి అవగాహన కల్పించి, అత్యధిక సంఖ్యలో దరఖాస్తులు నమోదయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు మండల విద్యాధికారులు, ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఎయిడెడ్, గుర్తింపు పొందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవసరమైన సూచనలు జారీ చేసి, అర్హులైన ప్రతి ఐదో తరగతి విద్యార్థికి సమాచారం అందించడంతో పాటు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో తల్లిదండ్రులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. మండలాల వారీగా నమోదవుతున్న దరఖాస్తులను నిరంతరం పర్యవేక్షిస్తూ గరిష్ఠ నమోదు జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ శాఖ అధికారులు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామపంచా యతీల ద్వారా ప్రతి గ్రామంలో నోటిఫికేషన్‌పై విస్తృత ప్రచారం నిర్వహించి, గ్రామీణ ప్రాంతాల అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకునేందుకు అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు. జవహర్ నవోదయ విద్యాలయాల్లో నాణ్యమైన, ఉచిత వసతి విద్యను అందించే ఈ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకుని జూలై 31లోగా తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసు కోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ కోరారు.

# జూలై 18న ఛలో యువ సంగ్రామ సదస్సు

- పటాన్‌చెరు నుంచి 5 వేల మంది యువత హాజరు: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్‌చెరు, జూలై 15 :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, నిరుద్యోగ డిక్లరేషన్ అమలు కోసం బీఆర్ఎస్ పార్టీ ఈ నెల 18న హైదరాబాద్‌లో నిర్వహించనున్న "యువ సంగ్రామ సదస్సు"కు పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి 5 వేల మంది యువత హాజరవుతారని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన నిరుద్యోగ డిక్లరేషన్లో యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర అంశాలపై అనేక హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా, ఆ హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఉద్యోగ నియామకాలలో జాప్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలులో నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు, నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం యువతను నమ్మించి మోసం చేసిందని ఆరోపించారు. యువ సంగ్రామ సదస్సు ద్వారా ప్రభుత్వంపై ప్రజాస్వామ్య బద్ధంగా ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని అన్ని మున్సిపాలిటీలు, డివిజన్లు, గ్రామాల నుంచి ఐదు వేల మంది యువత సదస్సులో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. అలాగే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఓటరు తమ దరఖాస్తులు పూర్తి చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ అమలులో పటాన్‌చెరు నియోజకవ ర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాలని కోరారు. అభివృద్ధికి ఓటు హక్కు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతిని ధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సహకార సంఘ నూతన భవనం ప్రారంభోత్సవంలో కవ్వంపల్లి

## సహకార వ్యవస్థ బలోపేతం సర్కార్ లక్ష్యం

**మానకొండూర్ ప్రతినిధి, జూలై 15 :** రైతులకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో సహకార వ్యవస్థ బలోపేతానికి చిత్త శుద్ధితో కృషి చేస్తున్నదని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బెజ్జంకి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల్లో సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నదని చెప్పారు. రైతులకు మెరుగైన సేవలు అందించడంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. నూతన భవనం ద్వారా రైతులకు ఒకే చోట రుణాలు, వ్యవసాయ సంబంధిత సేవలు, సంక్షేమ పథకాల అమలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. రైతులు సహకార సంఘాల సేవలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం భవనంలోని కార్యాలయ గదులను పరిశీలించి, అధికారులు రైతులకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ తన్నీరు శరత్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, జిల్లా పార్టీ కార్యదర్శి అక్కరవేణి పోచయ్య ముదిరాజ్ తదితరులతోపాటు సహకార సంఘ డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.



### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్నదని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. బుధవారం బెజ్జంకి మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆయన వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట్ర ఖజానా ఖాళీ అయ్యిందని, ఆర్థికపరమైన సమస్యలు ఉన్నప్పటికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నదని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చేందుకు కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండ నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి అక్కరవేణి పోచయ్య ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్ తోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాల తనిఖీ

బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మానకొండూర్ ఎమ్మెల్య డాక్టర్ కవ్వంపల్లి సత్యారాయణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. వంట గది శుభ్రత, వంటల్లో శుచి గురించి వంటవాళ్లను అడిగి తెలుసుకోవడమే కాకుండా తగు సూచనలు చేశారు.

### సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

బెజ్జంకి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం భూమి పూజ చేశారు. అంతకు ముందు ఆయన ముత్తన్నపేట గ్రామంలో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. నిర్ణీత గడువులోగా ఆయా సీసీ రోడ్డు నిర్మాణాలు పూర్తి చేయించాలని, పనుల నాణ్యతను పర్యవేక్షించాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు.

### పరామర్శ

బెజ్జంకి మండల కేంద్రంలో ఇటీవల మరణించిన జంగిటి రాజయ్య కుటుంబ సభ్యులను మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా రాజయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# జమ్మికుంట మానేరు ఇసుకను స్థానిక ప్రజలకే అందుబాటులోకి తేవాలి

- **బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ముందు నిరసన**

**జమ్మికుంట జులై 15పీపుల్స్ డైరీ :** జమ్మికుంట పట్టణ బిజెపి పార్టీ అధ్యక్షులు కొలకాని రాజు ఆధ్వర్యంలో స్థానిక తాసిల్దార్ కార్యాలయం ముందు బిజెపి పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి, కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు, ఈసందర్భంగా బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు, మాజీ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ శీలం శ్రీనివాస్ జమ్మికుంట డిప్యూటీ తహశీల్దార్ కి వినతి పత్రం అందజేశారు, ఈసందర్భంగా మాట్లాడుతూ గత పదిరోజుల క్రితం గాంధీ చౌరస్తాలో భారతీయ జనతా



పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మానేరు ఇసుకను స్థానిక జమ్మికుంట పరిసర ప్రాంతాల ప్రజలకు తక్కువ ధరకు, సులభంగా అందించాలని ఒక రోజు నిరసన దీక్ష చేపట్టిన, కాంగ్రెస్ ప్రభుత్వం కానీ, స్థానిక ఎమ్మెల్యే కానీ, అధికారులు ఇంతవరకు స్పందించడం లేదని ఎద్దేవా చేశారు, తనుగుల, విలాసాగర్ లో దొరికే ఇసుకను ఇతర జిల్లాలకు తరలించి డబ్బులు దండుకుంటూ, జమ్మికుంట ప్రజలకు బ్లాక్ లో ఎనిమిది వేల రూపాయలు అధికంగా అమ్ముకుంటూ జమ్మికుంట ప్రజలపై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే, అధికారులు వారంలోగా ప్రజలకు ఇసుకను అందుబాటులోకి తేవాలని, లేనట్లయితే ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున నిరసన దీక్షలు చేపడతామని హెచ్చరించారు, ఈకార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కైలాసకోటి గణేష్, కొరె రవిందర్, అప్పం మధు, గుర్రం పరుశురాం, అడువాల శ్రీధర్, కేస స్వరూప, ఆకుల తిరుపతి, పోచయ్య, తుర్పాటి శంకర్, ఉడుగుల మహేందర్, సమ్మిరెడ్డి, బొజ్జ శరత్ తదితరులు పాల్గొన్నారు

# 18 వ రోజుకు చేరుకున్న సోనం వాంగ్‌చుక్ అమరణ నిరాహార దీక్ష




**హుస్నాబాద్, జులై 15, ( పీపుల్స్ డైరీ ) :** నీట్ పరీక్ష వైఫల్యాలపై, 18 మంది విద్యార్థుల మరణాలకు బాధ్యత వహించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని గత 18 రోజులుగా ప్రముఖ మానవ హక్కుల నేత, పర్యావరణవేత్త జమ్మూడ కాశ్మీర్ కు సంబంధించిన వ్యక్తి సోనం వాంగ్ చుక్ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేయడం జరుగుతుంది. ఇట్టి దీక్షకు మద్దతుగా అభిజిత్ దుల్కే అధ్యక్షత వహిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ ఎంతోమంది విద్యార్థి సంఘ నాయకులు వివిధ పార్టీలు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం జరుగుతుంది. ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్న దృష్ట్యా,రేపు ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సోనం వాంగ్ చుక్ ప్రాణానికి ఎటువంటి అపాయం కలిగిన కేంద్రంలో ఉన్న బిజెపి మోడీ ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందని ఈ సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ పక్షాన హెచ్చరించడం జరుగుతుంది. మోడీ ప్రభుత్వం లో ఎంత అవినీతి జరిగినా నోరు మెదపకుండా ప్రజాస్వామ్యానికి జవాబు చెప్పకుండా దాటవేస్తూ, ప్రతిపక్షాల గొంతులు అణిచివేయాలని చూడడం చాలా బాధాకరం. మోడీ ప్రభుత్వానికి బాధ్యత ఉంటే మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయించి సోనం. వాంగ్ చెక్ నిరాహార దీక్ష విరమింపచేయాలని బీఎస్పీ పార్టీ పక్షాన కూడా జరుగుతుంది. అదేవిధంగా పరీక్షల నిర్వహణ విషయంలో తప్పులకు పాల్పడే వారికి కఠిన శిక్షలు ఉండాలని ఈ సందర్భంగా కోరడం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం కాక్రోచ్ జనతా పార్టీ తో చర్చలు జరపకపోతే జూలై 20వ తేదీ నాడు యువత పార్లమెంటు ముట్టడికి పెద్ద ఎత్తున సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది. బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్, పచ్చిమట్ల రవీందర్ గౌడ్. ఎలగందుల శంకర్, వేల్పుల రాజు, మారిశెట్టి సుధాకర్,, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు రైతు వేదికలో ఎల్ నీనో అవగాహన కార్యక్రమం

**కమలాపూర్ జులై 15 (పీపుల్స్ డైరీ) :** కమలాపూర్ మండల కేంద్రంలోని గూడూరు గ్రామంలోని రైతు వేదికలో ఎల్ నినో అంటే ఏమిటి? దాని ప్రభావం ఎలా ఉంటుంది?ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో వచ్చే వాతావరణ మార్పు. దీని వల్ల మన రాష్ట్రంలో క్రింది సమస్యలు వస్తాయి,వర్షాల కొరత రుతుపవనాలు బలహీనపడి, సకాలంలో వర్షాలు పడవు.పొడి వాతావరణం: వర్షాల మధ్య ఎక్కువ రోజులు గ్యాప్ రావడం వల్ల భూమి త్వరగా ఎండిపోతుంది.నీటి కొరత: ప్రాజెక్టులు, చెరువులు, మరియు బోరుబావుల్లో నీటి మట్టాలు వేగంగా పడిపోతాయి. ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు, ఎక్కువ నీరు కావలసిన వరి లాంటి పంటల జోలికి వెళ్లకుండా, తక్కువ నీటితో పండే పంటలను ఎంచుకోవాలి.



పండించాల్సిన ప్రత్యామ్నాయ పంటలు: పప్పుధాన్యాలు: కందులు, పెసర్లు, మినుములు, నూనెగింజలు, వేరుశనగ, సోయాబీన్, పొద్దుతిరుగుడు,చిరుధాన్యాలు,మిల్లెట్స్ జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు ఇవి కరువును తట్టుకుంటాయి.వాణిజ్య పంటలు: తక్కువ నీటి వసతి ఉన్న నేలల్లో మాత్రమే పత్తి రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలుస్వల్పకాలిక రకాలు తక్కువ రోజుల్లో కోతకు వచ్చే విత్తన రకాలను ఎంచుకోవాలి. లినీటి పొదుపు: డ్రిప్ లేదా స్ప్రింక్లర్ పద్ధతుల ద్వారా 50% వరకు నీటిని ఆదా చేయవచ్చు.కలిసికట్టుగా అంతరపంటలు: పత్తి, కంది లాంటి అంతరపంటలు వేయడం వల్ల ఒక పంట దెబ్బతిన్నా, మరో పంటతో పెట్టుబడి దక్కుతుంది. నేల తేమను కాపాడుకోవడం: మల్చింగ్ పద్ధతి లేదా పంట వ్యర్థాలను పొలంలో ఉంచడం ద్వారా భూమిలోని తేమ ఆరిపోకుండా చూసుకోవచ్చు.

## పేకాట స్థావరంపై పోలీసుల ఆకస్మిక దాడి ఆరుగురు అరెస్ట్



**భూపాలపల్లి జూలై 15 పీపుల్స్ డైరీ :** జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆదేశాల మేరకు భూపాలపల్లి జిల్లా సి ఎస్ సీఐ రమేష్, ఆధ్వర్యంలోనీ సిసిఎస్ పోలీసులు బుధవారం సాయంత్రం భూపాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం గ్రామం--ఆజాంనగర్ అటవీ ప్రాంతం మధ్య ఉన్న అటవీ ప్రాంతంలో పేకాట నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకోగా, వారి వద్ద నుంచి రూ.7,450 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దాడి జరుగుతున్న సమయంలో మరో 7 మంది నిందితులు పరారయ్యారు.అరెస్టు చేసిన నిందితులను, స్వాధీనం చేసుకున్న నగదు మరియు ఇతర వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం భూపాలపల్లి పోలీస్ స్టేషన్ లో అప్పగించారు. పరారీలో ఉన్న నిందితులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.జూదం, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై జిల్లా పోలీసులు ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు కొనసాగిస్తారని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజలు ఇటువంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్--100కు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు..

# ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం

### ఏఏవై 35 కిలోల బియ్యం రద్దు సరికాదు -వ్యకాస



**సింగరేణి కారేపల్లి జులై 15 (పీపుల్స్ డైరీ) :** నిత్యావసర ధరలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో.. పేద ప్రజలకు ఉపశమనం కలగడానికి ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం దానిని నిర్వీర్యం చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం కారేపల్లిలో చౌక ధర దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ చౌక దుకాణాల ద్వారా 14 రకాల నిత్యవసర వస్తువులు పంపిణీ చేయాల్సిన ప్రభుత్వం బియ్యం పంపిణీ తోనే సరిపోతుంది అని అన్నారు. అత్యంత, పేదలు, నిర్భాగ్యులకు అంత్యోదయ అన్నపూర్ణ (ఏఏవై) కార్డు ల ద్వారా అందించే 35 కిలోల బియ్యం రద్దు చేయడం పేదల కడుపు కొట్టడమే అని అన్నారు. కార్డు కు 35 కిలోలు బియ్యం ఇచ్చేదాన్ని తగ్గించి మనిషికి ఏడు కిలోల ఇవ్వడం అవివేకం అన్నారు. అంత్యోదయ అన్నపూర్ణ రేషన్ కార్డు కొనసాగించాలని, చౌక దుకాణాల ద్వారా 14 నిత్యవసర వస్తువులు సరఫరా చేయాలని డిమాండ్ తో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టే నిరసన కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యకాస నాయకులు పాసిని నాగేశ్వరావు, అన్నవరపు కృష్ణ, ముండ్ల ఏకాంబరం కర్కపల్లి రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

# గీతంలో ఇండస్ట్రియల్ ఫార్మసీ

### ఎం.ఫార్మ్. కోర్సు 2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం

**పటాన్చెరు, జూలై 15:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ ఫార్మసీ 2026–27 విద్యా సంవత్సరం నుంచి ఇండస్ట్రియల్ ఫార్మసీలో ఎం.ఫార్మ్. కోర్సును ప్రారంభించడానికి భారత ఫార్మసీ కౌన్సిల్ (పీసీఐ) ఆమోదించింది. దీనితో పోస్టు గ్రాడ్యుయేట్ విద్య మరింత బలోపేతం కావడంతో పాటు, ఫార్మసీ వృత్తి నిపుణులు కావాలనుకునే వారికి అవకాశాలు కూడా విస్తరిస్తున్నాయని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ మంగళవారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించారు. ఈ చేర్పుతో, స్కూల్ ఆఫ్ ఫార్మసీ నాలుగేళ్ల బి.ఫార్మ్ కోర్సుతో పాటు ఇండస్ట్రియల్ ఫార్మసీ, ఫార్మాస్యూటికల్ అనాలిసిస్, ఫార్మాస్యూటిక్స్ అనే మూడు పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులను అందిస్తోందని తెలియజేశారు. ఈ కొత్త కోర్సు, ఫార్మాస్యూటికల్ తయారీ, నాణ్యత హామీ, నియంత్రణ వ్యవహారాలు, పారిశ్రామిక పరిశోధన రంగాలలో విద్యార్థులకు ఉన్నత పరిజ్ఞానం, పరిశ్రమ–ఆధారిత నైపుణ్యాలను అందించేలా రూపొందించామన్నారు. స్కూల్ ఆఫ్ ఫార్మసీ నాణ్యమైన విద్య, పరిశోధన, ఆవిష్కరణల ద్వారా తన విద్యాపరమైన ఖ్యాతిని నిరంతరం బలోపేతం చేసుకుంటోందని తెలిపారు. తన విద్యాపరమైన స్థాయిని మరింత పటిష్టం చేస్తూ, ఈ స్కూల్ ఎన్ఐఆర్ఎఫ్ 2025 ర్యాంకింగ్స్ లో ఫార్మసీ విభాగంలో 33వ ర్యాంకును పొందిందన్నారు. ఫార్మసీ ప్రిన్సిపాల్‌గా తన నేతృత్వంలో, ఈ స్కూల్ అనేక ముఖ్యమైన మైలురాళ్లను సాధించినట్టు ప్రొఫెసర్ శివకుమార్ తెలియజేశారు. అధ్యాపక బృందం పరిశోధన, ఆవిష్కరణ, ఫార్మసీ విద్యలో వారి నైపుణ్యానికి గాను ప్రతిష్టాత్మక అవార్డులు, పేటెంట్లు, జాతీయ, అంతర్జాతీయ గుర్తింపులను కూడా అందుకున్నట్టు ఆయన వివరించారు. ఫార్మసీ స్కూల్ ఔషధ ఆవిష్కరణ, న్యూరోడీజెనరేటివ్, క్యాన్సర్ చికిత్సలు, అధునాతన ఔషధ పంపిణీ వ్యవస్థలు, నానోథెరనోస్టిక్స్, త్రీడీ ప్రింటింగ్, సస్టెయిన్డ్–రిలీజ్ ఫార్ములేషన్స్ వంటి రంగాలలో గణనీయమైన కృషి చేసి, ఒక శక్తివంతమైన పరిశోధనా కేంద్రంగా కూడా ఆవిర్భవించిందన్నారు. అధిక ప్రభావం చూపే జర్నల్స్ లో ఈ స్కూల్ ప్రచురణల రికార్డు నిరంతరం పెరుగుతూ ఉండటం, అత్యాధునిక ఫార్మాస్యూటికల్ పరిశోధన, ప్రపంచ విద్యా నైపుణ్యం పట్ల తమ సంస్థ యొక్క నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ప్రొఫెసర్ శివకుమార్ వివరించారు. ఇండస్ట్రియల్ ఫార్మసీలో ఎం.ఫార్మ్ కోర్సను ప్రవేశపెట్టడం అనేది, ఫార్మాస్యూటికల్ పరిశ్రమ యొక్క మారుతున్న అవసరాలను తీరుస్తూనే, పరిశోధన, ఆవిష్కరణ, ఆరోగ్య సంరక్షణకు దోహదపడే అత్యంత నైపుణ్యం గల ఫార్మసీ నిపుణులను తయారు చేయాలనే గీతం నిబద్ధతను ప్రతిబింబిస్తుందని అన్నారు. మరిన్ని వివరాల కోసం https://www.gitam.edu/hyderabad/gitam-school-of-pharmacyని సందర్శించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

# పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్: నీలం మధు ముదిరాజ్

### లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**పటాన్‌చెరు, జూలై 15 :** ఆపత్కాలంలో పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ఒక సంజీవనిలా మారిందని, నిరుపేదల ఆరోగ్య భద్రతకు ఈ నిధి ఎంతో భరోసానిస్తోందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం ఎన్ఎంఆర్ క్యాంపు కార్యాలయంలో అమీన్‌పూర్ డివిజన్‌కు చెందిన అనసుజకు రూ.60,000, గుమ్మడిదల మండలానికి చెందిన సీహెచ్ శ్రీనివాస్కు రూ.47,500, ఇస్నాపూర్ మున్సిపాలిటీ చిట్కుల్ గ్రామానికి చెందిన సంగన్నగారి మహేష్కు రూ.60,000 చొప్పున మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి కొండంత అండగా నిలుస్తోందని అన్నారు. సమయానికి వైద్యం అందక అప్పుల పాలవుతున్న అనేక కుటుంబాలను ప్రభుత్వం ఈ పథకం ద్వారా ఆదుకుంటోందని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలు అధైర్యపడకుండా సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ సహాయాన్ని పొందాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న ప్రతి బాధితుడి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా నిధులు మంజూరయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు నీలం మధు ముదిరాజ్ వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ




**దమ్మపేట, జూలై 15:** దమ్మపేట మండలంలో పలు గ్రామాలలో పర్యటించిన అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ గండుగులపల్లి గ్రామానికి చెందిన గోరం సురయ్య అనారోగ్యం కారణంగా మృతి చెందగా వారి పార్థివ దేహానికి నివాళు లు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం చిన్నగొల్లగూడెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న బడుగు ముత్యాలరావు మరియు చుక్కాల రామలక్ష్మి వారి నివాసాలలో కలిసి పరామర్శించి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా ఇటీవల బైక్ యాక్సిడెంట్‌కు గురైన వంక లక్ష్మణరావు, రమణ దంపతులను వారి నివాసానికి వెళ్ళి పరామర్శించి చికిత్స నిమిత్తం భరోసా కల్పించారు. అనంతరం నల్లకుంట గ్రామంలో వాడే కృప మరియు వంకా అలేఖ్య లకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. అదే గ్రామంలోని ఎం.పి.పి.ఎస్ స్కూల్ ని ఆకస్మికంగా సందర్శించి అక్కడ జరుగుతున్న పాఠశాల అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కక్కిరాల రమేష్, దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, గుర్రం మల్లేష్, ఇంటిక శాంతి కుమార్, చిన్నశెట్టి గోపి, దైవ ప్రసాద్, వేముల శ్రీను, అన్నవరపు నాగేంద్రరావు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## దుండిగల్‌లో ఓటరు సవరణ ప్రక్రియను పరిశీలించిన కొలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, జూలై 15 :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్ డివిజన్‌లో కొనసాగుతున్న స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఓటరు సవరణ ప్రక్రియ) కార్యక్రమాన్ని బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయిలో జరుగుతున్న ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, సవరణల ప్రక్రియను పరిశీలించి, సంబంధిత నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు ఈ సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అవసరమైన సహాయం అందిస్తూ, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలను సకాలంలో పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు సూచించారు. అలాగే ప్రజల సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముత్యం రెడ్డి, దుండిగల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్, మాజీ సర్పంచ్ కావలి గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నర్సింగ్ రావు గౌడ్, బొట్ల విజయకుమార్, మహేందర్ యాదవ్, కావలి శశికుమార్, పీఏస్ డైరెక్టర్ శ్రీనివాస్, ఆకుల ప్రేమ్ కుమార్, బాబు, చిన్న ముత్యం రెడ్డి, మధు, జక్కుల కృష్ణ, సిరిగల బాబు, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

## కబ్జా అవుతున్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి



**కుత్బుల్లాపూర్, జూలై 15 :** కుత్బుల్లాపూర్ మండల పరిధిలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను వెంటనే స్వాధీనం చేసుకుని, అక్రమ ఆక్రమణలను అరికట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ డిమాండ్ చేశారు. జగద్గిరిగుట్టలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన సర్వే నం. 348/1 భూమిని స్వాధీనం చేసుకోవాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని కోరారు. గాజులరామారంలోని స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ భూములు ఆర్టీసీ, పోలీస్ అకాడమీ అవసరాల కోసం కేటాయించామని చెబుతున్నప్పటికీ, కబ్జాదారులు వాటిని లక్షల రూపాయలకు పేదలకు విక్రయిస్తూ మోసాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆ భూములను స్వాధీనం చేసుకుని పేద ప్రజలు మోసపోకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పేట్‌బషీరాబాద్ సర్వే నం. 5లో జరుగుతున్న ఆక్రమణలపై కూడా అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. పేదలకు గృహ స్థలాల కోసం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో గుడిసెలు వేస్తే వాటిని అధికారులు కూల్చివేస్తున్నారని, అయితే ప్రభుత్వ భూములను ఆక్రమించి విక్రయిస్తున్న వారిపై మాత్రం చర్యలు తీసుకోవడం లేదని ఉమా మహేష్ విమర్శించారు. రాష్ట్ర పార్టీ నిర్ణయం మేరకు ఇళ్ల స్థలాలు లేని పేదలను సమీకరించి సెప్టెంబర్ నెలలో భూ పోరాటాన్ని నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ మేరకు బుధవారం మండల రెవెన్యూ అధికారి బైరెడ్డి రాజేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్, కార్యవర్గ సభ్యులు నర్సింహారెడ్డి, కనకయ్య, కృష్ణ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముల్కనూరు మహిళా డెయిరీ 24వ వార్షిక మహాసభ

- రూ. 18 కోట్ల లాభం.. రూ. 15.71 కోట్ల బోనస్ పంపిణీ
- మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి: మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి
- త్వరలోనే మార్కెట్లోకి కొత్త పాల ఉత్పత్తులు

**భీమదేవరపల్లి, జూలై 15 (పీపుల్స్ డైరీ ):** గ్రామీణ మహిళల ఆర్థిక అభ్యున్నతికి, రైతు కుటుంబాల సంక్షేమానికి, నాణ్యమైన పాల ఉత్పత్తులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ముల్కనూరు సహకార మహిళా డెయిరీ 24వ వార్షిక మహాసభ బుధవారం సంఘ ఆవరణలో ఘనంగా జరిగింది. డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ అధ్యక్షత వహించిన ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే, ముల్కనూర్ సహకార గ్రామీణ పరపతి సంఘ అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ, మహిళలు నాణ్యమైన గేదె పాల దిగుబడులను పెంచి ఆర్థిక అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. వినియోగదారుల అభిరుచుల మేరకు నాణ్యమైన పాలను సరఫరా చేస్తూ ముల్కనూరు డెయిరీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటోందని కొనియాడారు. అనంతరం డెయిరీ జనరల్ మేనేజర్ మార్పాటి భాస్కర్ రెడ్డి వార్షిక నివేదికను చదివి వినిపించారు. గత సంవత్సరంతో పోలిస్తే పాల సేకరణతో పాటు అమ్మకాలు కూడా భారీగా పెరిగాయని ఆయన వెల్లడించారు.

### ఆర్థిక ప్రగతి.. లాభాల బాట!

డెయిరీ సాధించిన వార్షిక ప్రగతి వివరాలను మేనేజ్‌మెంట్ వెల్లడించింది: పాల సేకరణ: గత ఏడాది సగటున రోజుకు 70,000 లీటర్ల పాలు సేకరించగా, ప్రస్తుతం అది 82,000 లీటర్లకు చేరింది. రోజువారీ కొనుగోళ్లు: సగటున రోజుకు రూ. 30 లక్షల విలువైన



పాలను రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు.

### వ్యాపార టర్నోవర్ & లాభం

ప్రస్తుతం సంఘం రూ. 194 కోట్ల వ్యాపారం చేయగా.. రూ. 18 కోట్ల నికర లాభం గడించింది. సభ్యులకు బోనస్: వచ్చిన లాభాల్లో నుంచి సభ్యులకు రికార్డు స్థాయిలో రూ. 15 కోట్ల 71 (లక్షలను) బోనస్‌గా పంపిణీ చేశారు.

### రైతులకు సబ్సిడీలు:

పశుగ్రాసం, దానా, గడ్డి గింజలు, పశువుల మందుల కోసం రూ. 17 లక్షలను సబ్సిడీ కింద అందించారు.

24 ఏళ్ల ప్రస్థానంలో అద్భుత ప్రగతి

ఈ 24 సంవత్సరాల కాలంలో డెయిరీ ఏకంగా రూ. 2,000 కోట్ల వ్యాపారం చేసింది. ఇందులో రూ. 1,000 కోట్ల పాలను రైతుల నుంచే కొనుగోలు చేయగా.. సభ్యులకు రూ. 139 కోట్ల బోనస్‌ను పంపిణీ చేయడం విశేషం.

### భద్రత - రైతు సంక్షేమమే ధ్యేయం

రైతు కుటుంబాల సంక్షేమం కోసం డెయిరీ పలు సామాజిక భద్రతా పథకాలను అమలు చేస్తోంది: దహన సంస్కారాల సహాయం: చనిపోయిన 214 మంది సభ్యుల కుటుంబాలకు రూ. 7,500 చొప్పున మొత్తం రూ. 16



లక్షల 5 వేలు పంపిణీ చేశారు. సహజ మరణాలు: సహజ మరణం పొందిన 92 మంది కుటుంబాలకు రూ. 32 లక్షల 20 వేల ఆర్థిక సహాయం అందించారు. ప్రమాద బీమా: ప్రమాదవశాత్తు చనిపోయిన నలుగురి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 75 వేల చొప్పున రూ. 3 లక్షలు, పశువుల బీమా కింద రూ. 5 లక్షలు పంపిణీ చేశారు.

### త్వరలో సరికొత్త పాల ఉత్పత్తులు

మార్కెట్లో మారుతున్న డిమాండ్‌కు అనుగుణంగా త్వరలోనే జున్ను కప్పులు, సబ్జా లస్సీ, షుగర్ లెస్ నెయ్యి వంటి మరికొన్ని సరికొత్త నాణ్యమైన ఉత్పత్తులను వినియోగదారులకు అందుబాటులోకి తేనున్నట్లు మేనేజ్‌మెంట్ ప్రకటించింది.

### ముగ్గురు డైరెక్టర్ల ఎన్నిక ఏకగ్రీవం!

డెయిరీలోని ఖాళీగా ఉన్న మూడు డైరెక్టర్ స్థానాలకు జరిగిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. 2వ వార్డు నుంచి బొల్లంపల్లి చంద్రకళ (ముస్తఫాపూర్), 7వ వార్డు నుంచి మాందాడి శోభారాణి (శోడశపల్లి), 8వ వార్డు నుంచి కర్ర రమాదేవి (పీచర) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ వార్షిక మహాసభలో ఎన్.డి.డి.బి తెలంగాణ సీనియర్ మేనేజర్ లత, ఎస్బీఐ ఫీల్డ్ ఆఫీసర్ నాగసాయి, కెనరా బ్యాంక్ మేనేజర్ సాయిచరణ్, డెయిరీ ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో మహిళా సభ్యులు పాల్గొన్నారు.

## పోక్సో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి: స్వేరోస్

- హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం, నిరసన ర్యాలీ

**హుజూరాబాద్, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** పిల్లలు, మహిళలపై పెరుగుతున్న లైంగిక దాడులు, హత్యలను నిరసిస్తూ స్వేరోస్ ఆధ్వర్యంలో బుధవారం హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి, నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా స్వేరోస్ నాయకురాలు ఆకినపల్లి శిరీష మాట్లాడుతూ, 9 నెలల పసికందు నుంచి వృద్ధ మహిళల వరకు లైంగిక దాడులు, హత్యలు జరుగుతున్న ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాలు, బీసీ



సంఘాల నాయకులు పాల్గొనడంతో పాటు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు.

### ప్రముఖులు పాల్గొన్నారు

ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, బీసీ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జనార్ధన్, జేఏసీ అధ్యక్షుడు సందెల వెంకన్న, డీసీ జేఏసీ కార్యదర్శి చిలకమారి శ్రీనివాస్, హుజూరాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ గందె శ్రీనివాస్, రాధిక, మాజీ జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పొంగలి రమేష్, ప్రజాసంఘాల నాయకులు ఇప్పకాయల సాగర్, స్వేరోస్ సీనియర్ నాయకులు గడప రాజు, మేకల రవీందర్, దేవసాని ప్రియదర్శిని, ప్రవీణ్, క్రాంతి, సొల్లు బాబు, శోభ, ఎండీ బాబర్, ఎండీ ఫరీదా, వాగ్దేవితో పాటు ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కళాశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చిన్న కుమ్మరి కుంట పూడికతీత పనులకు అధికారులు పర్మిషన్ ఇవ్వాలి




**సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) జూలై 15 :** పట్టణంలోని మహమ్మదాపూర్ రోడ్ లో ఉన్న సర్వే నెంబర్ 81 లో చిన్న కుమ్మరి కుంట ఒక ఎకరం 12 గుంటల విస్తీర్ణంలో ఉండేది పూర్వకాలం నుంచి చుట్టుపక్కల రైతుల పంట పొలాలకు నీరు అందిస్తూ వస్తుంది అయితే గత కొన్ని సంవత్సరాలుగా కుంట పూడిక తీయకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి చుట్టుపక్కల బావులలో బోర్లలో నీటి సామర్థ్యం పూర్తిగా నశించిపోయింది దాని ద్వారా కుంటలో నీళ్లు నిలువక బావులలో నీరు లేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు 2023 నుంచి అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న చిన్న కుమ్మరి కుంట సమస్యకు పరిష్కారం చూపించడం లేదని తూతూ మంత్రంగా హద్దులు నిర్ణయించారు తప్ప కుంట విస్తీర్ణం నీటి సామర్థ్యం బోర్డును ఏర్పాటు చేయలేదని కుంట పూడిక లేకపోవడం వలన నీరు నిలువ ఉండక పోవడంతో భూగర్భ జలాలు నశించాయని పంటలు పండించలేక రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఇకనైనా అధికారులు స్పందించి చిన్న కుమ్మరి కుంట పూడిక తీసేందుకు పర్మిషన్ ఇచ్చి భూగర్భ జలాలను పెంచేందుకు సహాయ సహకారాలు అందించాలని రైతులు విజ్ఞప్తి చేశారు రాజకీయాలకు తావు లేకుండా రైతుల సంక్షేమం దృష్ట్యా చిన్నకుమ్మరి కుంట సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు ఆలోచన చేసి మట్టి తీసేందుకు పర్మిషన్ ఇవ్వాలని రైతులు తీవ్ర ఆవేదనతో విజ్ఞప్తి చేశారుచిన్న కుమ్మరి కుంట పూడికతీత పనులకు అధికారులు పర్మిషన్ ఇవ్వాలి

### అధికారులకు రైతులు విజ్ఞప్తి

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని మహమ్మదాపూర్ రోడ్ లో ఉన్న సర్వే నెంబర్ 81 లో చిన్న కుమ్మరి కుంట ఒక ఎకరం 12 గుంటల విస్తీర్ణంలో ఉండేది పూర్వకాలం నుంచి చుట్టుపక్కల రైతుల పంట పొలాలకు నీరు అందిస్తూ వస్తుంది అయితే గత కొన్ని సంవత్సరాలుగా కుంట పూడిక తీయకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి చుట్టుపక్కల బావులలో బోర్లలో నీటి సామర్థ్యం పూర్తిగా నశించిపోయింది దాని ద్వారా కుంటలో నీళ్లు నిలువక బావులలో నీరు లేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు 2023 నుంచి అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న చిన్న కుమ్మరి కుంట సమస్యకు పరిష్కారం చూపించడం లేదని తూతూ మంత్రంగా హద్దులు నిర్ణయించారు తప్ప కుంట విస్తీర్ణం నీటి సామర్థ్యం బోర్డును ఏర్పాటు చేయలేదని కుంట పూడిక లేకపోవడం వలన నీరు నిలువ ఉండక పోవడంతో భూగర్భ జలాలు నశించాయని పంటలు పండించలేక రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఇకనైనా అధికారులు స్పందించి చిన్న కుమ్మరి కుంట పూడిక తీసేందుకు పర్మిషన్ ఇచ్చి భూగర్భ జలాలను పెంచేందుకు సహాయ సహకారాలు అందించాలని రైతులు విజ్ఞప్తి రాజకీయాలకు తావు లేకుండా రైతుల సంక్షేమం దృష్ట్యా చిన్నకుమ్మరి కుంట సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు ఆలోచన చేసి మట్టి తీసేందుకు పర్మిషన్ ఇవ్వాలని రైతులు తీవ్ర ఆవేదనతో విజ్ఞప్తి చేశారు

## ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ దొంగల ముఠా అరెస్ట్

**ఏటూరునాగారం జూలై 15 (పీపుల్స్ డైరీ) :** బుధవారం ఎస్సై మహేష్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలలో భాగంగా స్థానిక ఐటీడీఏ కార్యాలయం ముందు పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా వెంబడించి పట్టుకొని తనిఖీ చేయగా 312 కిలోల కాపర్ వైర్, కటింగ్ ప్లేయర్లు ఆటోలో లభించగా వాటిని అంచుల సమక్షంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలు ములుగు జిల్లాలో 14, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాలుగు మొత్తం 18 ట్రాన్స్ఫార్మర్ కాపర్ వైర్ దొంగతనాల కేసులకు పాల్పడినట్లు నేరస్తులు అంగీకరించారు అన్నారు. వ్యవసాయ ట్రాన్స్ఫార్మర్లు వ్యవసాయ మోటార్లను ధ్వంసం చేసి వాటిలోని కాపర్ వైర్ ను దొంగిలించి మణుగూరు లోని స్క్రాప్ దుకాణాల్లో విక్రయించి వచ్చిన డబ్బులను అందరూ సమానంగా పంచుకొని ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు సుమారు 312 కిలోల ట్రాన్స్ఫార్మర్ల కాపర్ వైర్ ను స్వాధీనం చేసుకున్నట్లు దొంగతనాలకు ఉపయోగించిన ఆటోను కటింగ్ ప్లేయర్లు తదితర పనిముట్లను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ముత్యాలమ్మ నగర్ కు చెందిన గణపురం సాయి ప్రకాష్ఏహాని, చేపల మార్కెట్ రోడ్డు కు చెందిన షేక్ షంషీర్, హెచ్ పి గ్యాస్ గోడౌన్ వీధి కి చెందిన కూకట్ల అఖిల్, ఇందిరానగర్ కు చెందిన నల్లగట్ల దయాసాగర్ అను నలుగురు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన మన ఊరు నివాసులని విచారణలో తేలిందని ఎస్సై మహేష్ తెలిపారు. నిందితులు నలుగురిపై ఇతర కేసులు ఉన్నట్లు తెలిపారు దొంగిలించిన కాపర్ వైర్ ను కొనుగోలు చేసిన



స్క్రాప్ వ్యాపారుల ప్రమేయంపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు వ్యవసాయ ట్రాన్స్ఫార్మర్లు మోటార్లు లేదా విద్యుత్ పరికరాలు వద్ద అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే సమీప పోలీసులకు లేదా 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి! : ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య



**మట్టెవాడ, జూలై 15 (పీపుల్స్ డైరీ):** వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీలో నూతనంగా పదవులు పొందిన ఉపాధ్యక్షులు కూరతోట సదానందం, జన్ను ఆదామ్, ప్రధాన కార్యదర్శులు గోరంట్ల రాజు, శ్రీమతి కొయ్యడ ఉమా ప్రభాకర్, కార్యదర్శులుగా నియమితులైన దూపం సంపత్, దామెర సర్వేశం, గుళ్ళపల్లి హరికృష్ణ, ఈసీ మెంబర్ నలిగింటి బొబ్బిలిలను మాజీమంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య వారి స్వగృహంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొత్తగా డిసిసి కమిటీలో స్థానం పొందిన వారిని ఉద్దేశించి బస్వరాజు సారయ్య మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని, అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే అన్ని సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేరువయ్యేలా చూడాలని, వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ మెంబర్ నల్గొండ రమేష్, మాజీ కార్పొరేటర్లు గుండేటి నరేంద్ర కుమార్, బస్వరాజు శిరీష శ్రీమాన్, జన్ను అరోహన్, తత్తరి లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకుడు బస్వరాజు కుమారస్వామి, యూత్ కాంగ్రెస్ తూర్పు అధ్యక్షుడు ఎండి.సలీం, జన్ను రవి, కరాటే ప్రభాకర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సోమ లక్ష్మి, ఐఎన్.టియూసి నాయకుడు బైరబోయిన చంద్రమౌళి, బొలుగుడ్డు శ్రీనివాస్, బత్తిని లింగయ్య, గిన్నారపు రాజు, వెల్దండి లక్ష్మణ్, బొలుగుడ్డు అనిల్ కుమార్, తోట బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎంసిపిఐ(యు)పార్టీలో భారీ చేరికలు



**మట్టెవాడ, జూలై 15 (పీపుల్స్ డైరీ):** వరంగల్ నగరంలోని జక్కలొద్ది గుడిసె వాసులు సుమారు 300 కుటుంబాలు మైదం వినోద, చిన్నం విజయ, మైదం వెంకటేశ్వర్లు, తాటికాయల సుస్మిత, బానోతు సుజాత, తాండ్ర కవిరాజు, చంద్రశేఖర్, జేరిపోతుల కమలమ్మ, ఏకు ప్రమీలల ఆధ్వర్యంలో ఎంసిపిఐ (యు )పార్టీలో భారీగా చేరారు. బుధవారం నగరంలోని ఓంకార్ భవన్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి గణేపాక ఓదేలు అధ్యక్షతన జరిగిన సభలో ఎంసిపిఐ యు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పార్టీ కండువాలు కప్పి వారిని ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంసిపిఐ యు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ గుడిసెలు పేదలు కార్మికులు నిరుపేద కుటుంబాల జీవన హక్కు కోసం ఎంసిపిఐ యు నిరంతరం పోరాడుతుందని అన్నారు. ప్రతి పేద కుటుంబానికి ఇంటి స్థలం ఇవ్వడం, నివాసం కల్పించడం రాజ్యాంగ హక్కు అని ఆయన గుర్తు చేశారు. ఈ నగరంలో వెలిసిన గుడిసె వాసులకు కనీసం మౌలిక సదుపాయాలు మంచి నీరు, విద్యుత్తు, రహదారులు కల్పించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు. గత నాలుగు సంవత్సరాల నుండి ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు పార్టీ క్షేత్రస్థాయి లో పోరాటం చేస్తుందని ప్రజల హక్కుల కోసం గుడిసె వాసుల హక్కుల కోసం మరింత ఉధృతంగా ఉద్యమాలు చేస్తామని పిలుపునిచ్చారు. ప్రజల ఐక్యతతోనే వారి సమస్యలు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. పార్టీలో చేరిన గుడిసె వాసులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంసిపిఐ యు పార్టీ పోరాడుతుందని, ఎంసిపిఐ యు పార్టీపై విశ్వాసంతో పార్టీలో చేరిన కుటుంబాలను పార్టీ కాపాడుకుంటుందని వారి సమస్యలు ప్రభుత్వం పరిష్కరించే అంతవరకు నిరంతరం పోరాడుతుందని రవి అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి, నగర కార్యదర్శి మాలోతు సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు బాష్పాక రమేష్, నగర నాయకులు దాసరపు అనిల్, రాయినేని ఐలయ్య పాల్గొని ప్రసంగించారు. ఈకార్యక్రమంలో మైదం శేఖర్, మైదం ఎలిషా, కుమ్మరి కళ, ఎండి.కైసర్, భాగ్యమ్మ, లక్ష్మి, జన్ను శాంత, కొమ్ముపుల విజయ, జక్కుల ఐలమ్మ, ఎండి.షాహిదా, కలకోట్ల సునీత, ఎండి.అప్సర తదితరులు తదితరులతో పాటు గుడిసె వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డిబీఎఫ్ గ్రామ అధ్యక్షుడిగా మాదాసి నవీన్ ఎన్నిక



**ఆత్మకూర్, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని నాగయ్య పల్లి దళిత బహుజన ఫ్రంట్ (డిబీఎఫ్) గ్రామ శాఖ అధ్యక్షుడిగా యువకుడు, విద్యావంతుడు మాదాసి నవీన్ ఏకగ్రీవంగా ఎన్నికైనారు. మంగళవారం నాగయ్యపల్లిలో డిబీఎఫ్ జిల్లా కార్యదర్శి మాదాసి సుదర్శన్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన గ్రామ కమిటీని ఎన్నుకోగా మాదాసి నవీన్ ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఉపాధ్యక్షుడిగా మాదాసి సురేందర్, ప్రధాన కార్యదర్శిగా గిన్నారపు కుమారస్వామి కార్యదర్శిగా మాదాసి కొమరమ్మ తో పాటు కమిటీ సభ్యులుగా రాజు, కవిత, ప్రమీల,సూరయ్య లను నియమించారు. కాగా తన నియామకానికి సహకరించిన డిబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్,జిల్లా కార్యదర్శి మాదాసి సుదర్శన్ తో పాటు, నాయకులకు మాదాసి నవీన్ కృతజ్ఞతలు తెలిపారు. పదవి రావడంతో తనపై బాధ్యత మరింత పెరిగిందని దళితుల సమస్యలపై మహనీయుల బాటలో పోరాడుతానని అన్నారు.

## ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన డిసిసి ఉపాధ్యక్షులు వేముల



**నర్సంపేట, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** నాపై నమ్మకంతో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమించేందుకు సిఫారసు చేసి నాకు అవకాశం కల్పించిన నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డికి కృతజ్ఞతాభివందనం తెలిపారు. నన్ను వరంగల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్‌ఖాన్‌కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అదేవిధంగా నాతోపాటు నిజాయితీతో, నిబద్ధతతో, అంకిత భావంతో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ ముందుకు సాగుతూ నా నియామకానికి కృషిచేసి నాకు శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ సోదరులకు అనుబంధ సంఘాల నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## కాట్రపల్లి శివాలయ నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు

### రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి



**కేసముద్రం, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామంలోని 800 ఏళ్ల చారిత్రక శివాలయ అభివృద్ధికి రూ.4 కోట్ల నిధులు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి మంజూరు చేసారు. కాకతీయ రాజు కాట్రెడ్డి నిర్మించిన ఈ ప్రాచీన ఆలయాన్ని ఆధునిక సౌకర్యాలతో పునర్ నిర్మించనున్నారు. ఆలయ ప్రాకారం, గోపురం, భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఈ నిధులు వినియోగించనున్నారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ చరిత్ర, సంస్కృతికి ప్రతీకలైన దేవాలయాల సంరక్షణ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని అన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. చారిత్రక ఆలయానికి భారీ నిధులు మంజూరు చేయడంతో గ్రామస్తులు, భక్తులు వేం నరేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## అంబులెన్స్ తనిఖీ



**కేసముద్రం, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** అత్యవసర వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు ప్రజల ప్రాణాలు కాపాడే విషయంలో క్షణక్షణం అప్రమత్తంగా ఉండాల్సిందే అని 108 ప్రోగ్రాం మేనేజర్ షేక్ నజురుద్దీన్ సిబ్బందిని గట్టిగా హెచ్చరించారు. బుధవారం కేసముద్రం మండల కేంద్రంలోని '108' అత్యవసర అంబులెన్స్‌ను ఆయన తనిఖీ చేశారు. ఏ క్షణంలోనైనా ప్రాణాలు కాపాడేందుకు సిద్ధంగా ఉండాల్సిన వాహనం కండిషన్‌ను, అందులోని అత్యవసర వైద్య పరికరాలు, మందుల నిల్వలను ఆయన స్వయంగా క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసి, లోపాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం మేనేజర్ షేక్ నజురుద్దీన్ మాట్లాడుతూ.. "పేద ప్రజలకు '108' ఒక సంజీవని లాంటిది. 24 గంటల పాటు ఉచిత అత్యవసర సేవలు ఎలాంటి ఆటంకాలు లేకుండా అందాలి. అంబులెన్స్‌లో ప్రతి నిమిషం మందులు, కీలక వైద్య పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలి. విధి నిర్వహణలో అలసత్వాన్ని అస్సలు సహించబోం" అని స్పష్టం చేశారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ బత్తిని మహేష్, పైలెట్ కంచ రవి, ఈఎంటి రౌతు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ




**మట్టెవాడ, జూలై 15 (పీపుల్స్ డైరీ):** వరంగల్ నగరంలో ఈ నెల 29న జరగనున్న సాయి సేవాదళ్ గురుపౌర్ణమి మహోత్సవాల పోస్టర్‌ను వరంగల్ లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ అదనపు డీసీపీ రాయల ప్రభాకర్ రావు బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ సాయి సేవాదళ్ వారు సేవా కార్యక్రమాలు, అన్నదానం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సాయి సేవాదళ్ అధ్యక్షులు ఆరుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ షిరిడీలో మాదిరి నాలుగు హారతులు, మధ్యాహ్నం 12గంటలకు అన్నదానం, సాయంత్రం పల్లకి ఉత్సవం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నందున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గురుపౌర్ణమి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య సభ్యులు పోలా మహేష్ స్వామి, చిట్టిమల్ల విజయ్ కుమార్, ఇరుకుల్ల నాగేశ్వర్ రావు, పబ్బ కిషోర్, వేముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లాలో అగ్రస్థానంలో నిలబెట్టాలి

### గ్రామ సర్పంచ్ మోడెం శ్రీలత



**నర్సంపేట, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** దుగ్గొండి మండలంలోని తిమ్మంపేట గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని బుధవారం గ్రామ జిపిఓ శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ మోడం శ్రీలత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మన గ్రామంలోని ప్రతి ఒక్కరి ఓటును తప్పిపోకుండా కృషి చేయాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నది. మన గ్రామంలో నాలుగు పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. ఎస్ఐఆర్ పూర్తి కావాల్సిన ఓటర్లు 768 మంది ఉన్నందున వెంటనే బిఎల్వోలు, వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు సిఏలు, అధికారులు అందరూ కలిసి రెండు రోజుల లోపు గ్రామంలోని మిగిలిన ఓటర్ల అందరివి ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పూర్తి చేసి వరంగల్ జిల్లాలో మన గ్రామాన్ని మొదటి స్థానంలో నిలపాలని కోరారు. దీనిపై ప్రతి ఒక్కరూ స్పందించి తల కొంతమంది ఓటర్లను ఎంపిక చేసుకొని ఎస్ఐఆర్ ప్రక్రియను అనుకున్న గడువులోపు పూర్తి చేస్తామని సమావేశంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఆనుమాన్ల దిలీప్ రెడ్డి, భూమా అశోక్,రొట్టె రమేష్ బోనగాని ఆగయ్య, కోమాండ్ల సురారెడ్డి,ఎస్ఐ ఆర్ ప్రక్రియ తిమ్మంపేట గ్రామ ఇన్చార్జి రాజ్ కుమార్, వార్డ్ మెంబర్లు బొంత రఘు, భాష బోయిన సురేష్, బి ఎల్ వో లు గ్రామ పెద్దలు, పోశాల నాగరాజు గొర్రె జనార్దన్ రెడ్డి సంఘీ సుమన్ దండు సంతోష్, ఉండ్రా తి నరేష్, గంగాడి అశోక్ రెడ్డి రమాదేవి శారద తెప్ప సుమలత, కొండ్ర సూరయ్య,గొల్లెన సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం



**నర్సంపేట, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** జనతా ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో, శంకర ఐ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరంలో మొత్తం 1,270 మంది కంటి పరీక్షలు చేయించుకోగా, అవసరమైన 356 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. అలాగే తీవ్రమైన కంటి సమస్యలు, శుక్లాలు (క్యాటరాక్ట్) వంటి వ్యాధులతో బాధపడుతున్న 107 మందిని ఉచిత కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేసి, జనతా ట్రస్ట్ శంకర్ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో జనతా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటువంటి సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన శంకర ఐ ఫౌండేషన్ వైద్య బృందానికి, సేవా కార్యక్రమంలో పాల్గొన్న వాలంటీర్లకు, దాతలకు పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలకు డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో నోట్ బుక్స్ పంపిణీ



**నర్సంపేట, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** దుగ్గొండి మండలంలోని తిమ్మంపేట గ్రామంలోని జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నోట్ బుక్స్ అవసరం ఉన్నందున తిమ్మంపేట గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ, సామాజిక సేవకుడు, కోమండ్ల నిరంజన్, సతీమణి కోమండ్ల నీరజ, కుమారుడు తేజ్ బుధవారం పాఠశాలకు వచ్చి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ మోడం శ్రీలత బుక్స్ అందజేసిన ఎన్నారై కోమండ్ల నిరంజన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను కాపాడుకొనుటకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, విద్యార్థుల సైతం ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని రెగ్యులర్గా పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను వంట పట్టించుకుని ఒక ఉన్నతమైన శిఖరాలకు ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉపాధ్యాయనీలు, గ్రామ పెద్దలు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## స్మశానవాటికలో నూతన నల్లాలు ప్రారంభం

**నెక్కొండ, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** మండలం అలంఖానిపేట గ్రామంలోని స్మశాన వాటిక వద్ద నూతనంగా నిర్మించిన స్నానపు నల్లాలను సర్పంచ్ రాంపెల్లి నిరోషా శ్రావణ్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాంపెల్లి నిరోషా శ్రావణ్ గౌడ్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధికి పాలకవర్గం కృషి చేస్తుందని, సహకరించిన పంచాయతీ సభ్యులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మాదాసు వెంకన్న, వార్డు సభ్యులు చీకటి వెంకన్న, ఆకుల ఉప్పలయ్య, కోలా రజిత నరేష్, కోరుకొండ అలివేణి శ్రీనివాస్ సీనియర్ నాయకులు నీలం రవి, మాదాసు సారంగం, మంగిశెట్టి రవి, యూత్ నాయకులు ఎడ్ల సందీప్, ఎడ్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్పణపల్లిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**కేసముద్రం, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** అర్పణపల్లి కిష్టపురం తండకి చెందిన విజయ కుటుంబా నికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.19,500 చెక్కును గ్రామ సర్పంచ్ చీర వెంకటమ్మ వీరస్వామి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటమ్మ మాట్లాడుతూ, అవసరంలో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందుతుండడం సంతోషకరమని అన్నారు. లబ్ధిదారుని కుటుంబ సభ్యులు సర్పంచ్‌కు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎల్నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా ఉండే అవకాశం

### వరి విస్తీర్ణం తగ్గించి మెట్ట పంటలు సాగు చేయాలి : ఏవో బి.వెంకన్న




**కేసముద్రం, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** వానకాలం 2026-27 సీజన్ లో ఎల్నినో ప్రభావం వల్ల సకాలంలో వర్షాలు కురిసే అవకాశం లేదని, సెప్టెంబర్ చివరి వరకు వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని కేసముద్రం మండల వ్యవసాయ అధికారి బి.వెంకన్న తెలిపారు. బుధవారం మహమూద్ పట్నం భూక్యా రామ్ తండా, తాళ్లపూసపల్లి, పెద్దమోరి తండా, కేసముద్రం రైతు వేదికలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో కూడా వరి విస్తీర్ణాన్ని తగ్గించి, పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని సూచించారు. తక్కువ నీటితో సాగయ్యే పెసర, మినుములు, కందులు, జొన్నలు, సజ్జలు, రాగులు, కూరగాయల పంటలను సాగు చేసి నష్ట నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. ఇప్పటికే వేసిన పత్తి, మొక్కజొన్న పంటలకు అడపాదడపా నీటి తడులు ఇచ్చి పంటలను రక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారి విజయ్, వ్యవసాయ విస్తరణ అధికారులు వి.లావణ్య, కె.ఎల్.శ్రీకాంత్, రాజీవ్,ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## అలంఖానిపేటలో పశువుల టీకాలు పంపిణీ



**నెక్కొండ, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** నెక్కొండ మండలం అలంఖానిపేట గ్రామ పశు వైద్యాశాలలో డాక్టర్ నోముల రామ్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువుల టీకాల పంపిణి కార్యక్రమాన్ని సర్పంచ్ రాంపెల్లి నిరోషా శ్రావణ్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాంపెల్లి నిరోషా శ్రావణ్ గౌడ్ మాట్లాడుతూ, పశువులకు ఎలర్జీ, దద్దులు రాకుండా ఉండేందుకు రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చీకటి వెంకన్న, ఆకుల ఉప్పలయ్య, కోలా రజిత నరేష్, డాక్టర్ నోముల రామ్మోహన్, రాంరాజ్, నీలం రవి, సముద్రాల అశోక్, సముద్రాల శ్రీనివాస్, ఎడ్ల సందీప్, మాదాసు సారంగం తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

- ప్రభుత్వ, పట్టా, గ్రామకంఠం భూములకు స్పష్టమైన హద్దులు
- జిల్లాలో 70 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా రీ సర్వే
- రీ సర్వేలో రైతులంతా భాగస్వాములు కావాలి
- చెల్పూర్, ధర్మరావుపేటలో గ్రామ సభల్లో ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ రాహుల్ శర్మ

**గణపురం, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వేతో దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం గణపురం మండలంలోని చెల్పూర్ గ్రామంలోని రైతు వేదిక, ధర్మరావుపేట గ్రామంలో నిర్వహించిన భూముల రీ సర్వే గ్రామ సభల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన పాల్గొని రైతులకు రీ సర్వే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, కన్నతల్లితో సమానమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే కార్యక్రమం ద్వారా దశాబ్దాలుగా పేరుకుపోయిన భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్నా హక్కు పత్రాలు లేని రైతులకు న్యాయం జరిగేలా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. సర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు నిర్ణయించడంతో పాటు ఆక్రమణలు, సరిహద్దు వివాదాలకు తెరపడుతుందని పేర్కొన్నారు. రీ సర్వేలో రైతులు స్వచ్ఛందంగా పాల్గొని తమ భూముల వివరాలు, పాత రికార్డులు అధికారులకు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. రైతుల భాగస్వామ్యంతోనే పారదర్శకంగా సర్వే పూర్తి చేయగలమని చెప్పారు. భూమిపై స్పష్టమైన హక్కులు ఉంటేనే రైతు భరోసా, రైతు బీమా, పంట రుణాలు, బ్యాంకు రుణాలు, పాస్‌బుక్కులు, భూముల కొనుగోలు--అమ్మకాలు వంటి అన్ని ప్రభుత్వ, బ్యాంకింగ్ సేవలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందుతాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలనే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. గ్రామాల్లో ముందుగా టామ్‌టామ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రతి రైతు గ్రామ సభలకు హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో తలెత్తే ప్రతి సందేహాన్ని అధికారులే నివృత్తి చేసి, ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. "భూమిపై రైతు హక్కు స్పష్టంగా ఉంటేనే రైతు భవిష్యత్తు భద్రంగా ఉంటుంది. అందుకే ప్రతి రైతు రీ సర్వేను సద్వినియోగం చేసుకుని తన భూమికి చట్టబద్ధమైన హక్కును నమోదు చేసుకోవాలి" అని ఎమ్మెల్యే గండ్ర పేర్కొన్నారు.





### "హద్దులు తేలితేనే.. భూ సమస్యలకు చెక్!": కలెక్టర్

భూ హక్కులను శాశ్వతంగా పరిరక్షించడం, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలకు ముగింపు పలకడమే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఈ ప్రక్రియ విజయవంతం కాదని, ప్రతి రైతు తప్పనిసరిగా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు కింద భూముల రీ సర్వేను చేపట్టిందని, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 70 గ్రామాలను ఇందుకోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశామని, వారే క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ భూములు, గ్రామకంఠం, పట్టా భూములతో పాటు అన్ని రకాల భూములకు శాస్త్రీయంగా హద్దులు నిర్ణయిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, అటవీశాఖ అధికారుల సమన్వయంతో పారదర్శకంగా సర్వే చేపడతామని తెలిపారు. గ్రామంలో భూములకు సంబంధించిన సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రజల సహకారంతోనే రీ సర్వే లక్ష్యాలు నెరవేరుతాయని పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం అమలులో భాగంగానే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రీ సర్వే పూర్తయిన తర్వాత సరిహద్దు వివాదాలు తగ్గి, రైతులకు స్పష్టమైన భూ హక్కులు లభించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకు రుణాలు, ఇతర సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ వివరించారు. ఈ గ్రామసభలలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, తహశీల్దార్ రాజేశ్వర రావు, ఎంపిడిఓ భాస్కర్, సర్పంచులు కావటి రజిత రవీందర్, మండల సర్వేయర్ తిరుపతి, పంచాయతీ కార్యదర్శి ముక్కెర హేమంత్, ఉప సర్పంచ్ పొనగంటి మల్హాల్ రావు, నాయకులు కొత్త వెంకన్న,లక్కం రాములు, సూరినేని సంపత్ రావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గణపురంలో భూ రీ-సర్వేను పరిశీలించిన కలెక్టర్





**గణపురం, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** భూ రీ-సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రతి భూమి సరిహద్దును ఖచ్చితంగా గుర్తించి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం గణపురం మండలం గణపురం శివారులో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వేయర్లు చేపడుతున్న సర్వే విధానం, భూ రికార్డుల నమోదు తీరును నిశితంగా తనిఖీ చేశారు. రోవర్ పరికరం ద్వారా అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా భూముల హద్దులను గుర్తిస్తున్న విధానాన్ని పరిశీలించి, సాంకేతికతను సమర్థంగా వినియోగించి ఎలాంటి సందేహాలకు తావులేకుండా సర్వే పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... భూ రీ-సర్వే పూర్తయితే సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. రైతుల భూములపై హక్కులు మరింత స్పష్టంగా నమోదవడంతో భవిష్యత్తులో తలెత్తే వివాదాలను నివారించవచ్చన్నారు. సర్వే ప్రక్రియ మొత్తం పారదర్శకంగా సాగాలని, ప్రతి రైతు భూమి వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని రైతులంతా భూ రీ-సర్వేకు పూర్తి సహకారం అందించాలని, ముఖ్యంగా సరిహద్దు ఉన్న భూముల యజమానులు తప్పనిసరిగా సర్వే సమయంలో హాజరై తమ అభిప్రాయాలు తెలియజేయాలని కలెక్టర్ కోరారు. రైతుల సహకారంతోనే రీ-సర్వే విజయవంతంగా పూర్తవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, తహశీల్దార్ రాజేశ్వర రావు, ఎంపీడీవో భాస్కర్, మండల సర్వేయర్ తిరుపతి, లైసెన్సుడ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ సర్పంచ్



**చిట్యాల, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** భూపాలపల్లి నియోజకవర్గంలోని చిట్యాల మండలం తిరుమలాపూర్ గ్రామ సర్పంచ్ జన్నే సురేష్ బీఆర్ఎస్ పార్టీని వీడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి తన వంతుగా గ్రామ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే సంకల్పంతో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. తిరుమలాపూర్ గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నాయకత్వంలో కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సర్పంచ్‌కు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గ్రామాల అభివృద్ధి ప్రజా సంక్షేమం కోసం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ఫారాలపై ప్రజలకు అవగాహన



**చెన్నూరు, జూలై 15(పీపుల్స్ డైరీ) :** చెన్నూరు నియోజకవర్గ పట్టణ పరిధిలో ఎస్ఐఆర్ ఫారాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని జనసేన పార్టీ నాయకులు బుధవారం విజయవంతంగా నిర్వహించారు. ప్రజలకు ఎస్ఐఆర్ ఫారాల అవసరం, వాటిని ఎక్కడ పొందాలి, ఏ విధంగా పూరించాలి అనే అంశాలపై పూర్తి సమాచారం అందిస్తూ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ సిద్ధూ ప్రజలకు ఎస్ఐఆర్ ఫారాలను స్వయంగా అందజేసి, వాటిని సక్రమంగా ఎలా నింపాలనే విషయాన్ని క్షుణ్ణంగా వివరించారు. ఫారాల పూరింపులో అవగాహన లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికుల సందేహాలను నివృత్తి చేస్తూ, వారికి అవసరమైన పలు సూచనలు చేశారు. అనంతరం పార్టీ నాయకుడు సిద్ధూ మీడియాతో మాట్లాడుతూ... ఎస్ఐఆర్ ఫారాల విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన కు గురికావాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ముఖ్య నాయకులు, జనసైనికులు, స్థానిక కార్యకర్తలు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలి

### ఇంటింటికి మొక్కలను పంపిణీ చేసిన సర్పంచ్ శ్రీలత అశోక్

**గణపురం, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించి మొక్కలు నాటి సంరక్షించాలని స్థానిక సర్పంచ్ విడిదినేని శ్రీలత అశోక్ అన్నారు. బుధవారం మండలంలోని బుద్ధారం గ్రామంలో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాల లో మొక్కలను నాటి సంరక్షించాలని తద్వారా పర్యావరణ సమతుల్యతకు దోహదపడాలని వారు విజ్ఞప్తి చేశారు. రోజురోజుకు అటవీ సంపద తగ్గడం వలన వర్షాభావ పరిస్థితులు సంభవిస్తున్నాయని అదే కాకుండా వాతావరణ కాలుష్యం రోజురోజుకు పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మారవేణి ఐలయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామగ్రామాన అంబేద్కర్ ఆశయాలే లక్ష్యం

### గణపురంలో సంఘం సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య



**గణపురం, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** గ్రామస్థాయి నుంచి అంబేద్కర్ యువజన సంఘాన్ని మరింత బలోపేతం చేసి, కుల మతాలకు అతీతంగా అంబేద్కర్ ఆశయాలను ప్రతి గ్రామానికి చేరవేయాలని అంబేద్కర్ ఫెలోషిప్ జాతీయ అవార్డు గ్రహీత, ఏవైఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు శనిగరపు రాజేందర్ అధ్యక్షతన నిర్వహించిన సంఘం సమావేశం, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ, రాష్ట్రవ్యాప్తంగా దళితులపై దాడులు, దౌర్జన్యాలు, అవమానకర ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో చైతన్యం తీసుకురావడం అత్యవసరమని అన్నారు. ఇందుకోసం గ్రామస్థాయి నుంచే అంబేద్కర్ యువజన సంఘాన్ని బలోపేతం చేసి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలు, భారత రాజ్యాంగ విలువలను ప్రజలకు వివరించాలని సూచించారు. భారత రాజ్యాంగం అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు, రిజర్వేషన్లు, ఓటు హక్కుతో పాటు అనేక రక్షణలు కల్పించిందని, ఆ మహనీయుడి ఆశయాలను గ్రామాల్లో కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకుడు, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అవార్డు గ్రహీత డాక్టర్ జేబీ రాజు, రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ అవిలయ్య సూచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని నాయకులు తెలిపారు. సంఘ సభ్యత్వ రుసుము రూ.100 గా నిర్ణయించినట్లు వెల్లడించి, అన్ని వర్గాల ప్రజలు సభ్యత్వం తీసుకుని సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు తిక్క సంపత్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బొల్లి బాబు, దూరపాక దుర్గయ్య, దూడపాక శ్రీనివాస్, అడ్వకేట్ దుప్పటి ప్రవీణ్, ఈర్ల రాజు, ఒడితెలా ఉపసర్పంచ్ ఖంపెల్లి శ్రీకాంత్, వార్డు మెంబర్ కొడెపాక అనిల్, తిక్క రాధాకృష్ణ, కోయిల కార్తీక్, జన్న ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రెగ్యులర్ డీఈవో, ఎంఈఓలను నియమించాలి



**చిట్యాల, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ నాగుల అరవింద్ ఆధ్వర్యంలో బుధవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం అరవింద్ మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు జిల్లా విద్యాశాఖ అధికారి మరియు అన్ని మండలాల్లో మండల విద్యాశాఖ అధికారులు ఇన్చార్జిలు కొనసాగుతున్నారని జిల్లాలో ఇన్చార్జి పాలన నడవడం వల్ల విద్యావ్యవస్థ గాడి తప్పిందని జిల్లా ఏర్పడి 9 సంవత్సరాల పైన అవుతుందని ఇన్ని ఏళ్లలో ఒక్క రెగ్యులర్ డీఈవో మాత్రమే జిల్లాలో పని చేశాడని ఆ తర్వాత మిగతా వాళ్ళందరూ కూడా ఇన్చార్జిలే అన్నారు. ఇన్చార్జి వ్యవస్థ వలన విద్యా వ్యవస్థ ఎలా మెరుగు పడుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనివల్ల పూర్తిగా విద్యా వ్యవస్థ విచ్ఛిన్న మైందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సీనియర్ ఉపాధ్యాయులను ఇన్చార్జి ఎంఈఓలుగా నియమించడం వలన విద్యార్థులకు సరైన విద్యాబోధన అందక వారు అధిక సమయాన్ని తాము నిర్వహిస్తున్న ఇన్చార్జి వ్యవస్థకు కేటాయించడం జరుగుతుందన్నారు. ఇన్చార్జిల వ్యవస్థతో ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్లో పర్యవేక్షణ లేకపోవడం జరుగుతుందని ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్స్ విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా జిల్లాలో ఇన్చార్జి పాలన ఉండడం వల్ల ప్రభుత్వ పాఠశాలలో నాణ్యత తగ్గిందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మండలాలలో రెగ్యులర్ ఎంఈఓలను నియమించాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లాలో రెగ్యులర్ డీఈవో నియమించాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కోశాధికారి వాసాల శ్రావణ్ కుమార్ పట్టణ నాయకులు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల వాణి వినరా..?

### కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి శ్రీధర్



**చిట్యాల, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** ప్రజల సమస్యలను విని పరిష్కరించాల్సిన ప్రజావాణి కార్యక్రమం బాధితుల ఆవేదనలకు వేదిక కాకుండా ప్రశ్నల పరంపరకు వేదికగా మారిందని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆత్మూరి శ్రీధర్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కేంద్రంలో బుధవారం మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఆశతో కలెక్టరేట్‌కు వస్తున్న బాధితులను వారి సమస్యలపై స్పందించాల్సిన అధికారులే మళ్లీ ఎందుకు వచ్చావ్..? ఎన్ని సార్లు వస్తావ్..?" అంటూ ప్రశ్నించడం బాధాకరమని ఆయన విమర్శించారు. డిసెంబర్ నెల నుంచి ప్రజావాణిలో పలుమార్లు దరఖాస్తులు సమర్పించినప్పటికీ తన సమస్యకు ఇప్పటికీ పరిష్కారం లభించలేదని ఆత్మూరి శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతూ చెప్పులు అరిగిపోయాయే గానీ సమస్య మాత్రం కదలల్లేదని అన్నారు. సమస్యను పరిష్కరించాలని వేడుకుంటే చర్యలు తీసుకోవడం బదులుగా పదేపదే ఎందుకు వస్తున్నారని ప్రశ్నించడం ప్రజల పట్ల నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని ఆరోపించారు. ప్రజావాణి కార్యక్రమం తీరుపై నిరసనగా కలెక్టరేట్ ప్రాంగణంలో పోస్టర్లు అతికించి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా వారినే ప్రశ్నించడం మానుకోవాలని నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రభుత్వం ప్రజాపాలన అంటూ గొప్పలు చెప్పుకుంటున్న సమయంలో ప్రజల సమస్యలను అధికారులే పట్టించుకోకపోతే ఇక ప్రజలు ఎవరిని ఆశ్రయించాలని ఆత్మూరి శ్రీధర్ ప్రశ్నించారు. ప్రజావాణి అంటే ప్రజల గొంతు వినిపించే వేదిక కావాలని ప్రజలను విసిగించే కార్యాలయంగా మారకూడదని అన్నారు. నా సమస్యకే పరిష్కారం లభించకపోతే సామాన్య ప్రజల సమస్యలకు న్యాయం ఎలా జరుగుతుంది అన్నారు. ప్రజావాణిలో దరఖాస్తు పెట్టుకున్న ప్రజలను ప్రశ్నించడం కాదు వారి సమస్యలకు పరిష్కారం చూపడం అధికారుల బాధ్యత అని అన్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా జోక్యం చేసుకుని పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఘనంగా బీరన్న దేవుని తొలి ఏకాదశి బోనాలు

**శాయంపేట, జూలై 15,(పీపుల్స్ డైరీ) :** మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో కురుమ కులస్తుల ఆరాధ్య దైవం బీరన్న దేవుని తొలి ఏకాదశి బోనాలను ఘనంగా నిర్వహించడం జరిగింది. కురుమ కులస్తుల డోలు వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా టపాసులు పేలుస్తూ ఊరేగింపుగా ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో కురుమ కులస్తులందరూ పాల్గొన్నారు. గ్రామస్తులందరూ వీక్షిస్తూ శోభాయాత్రలా బీరన్న బోనాల ఉత్సవం జరిగింది. బీరన్న దేవుని దివ్య ఆశీస్సులతో ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురవాలని మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దకోడెపాక కురుమ కుల పెద్దమనిషి అమ్మ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్న మహేందర్, అమ్మ అశోక్, ముజిగిరి వేణు, కొమ్ము సారంగపాణి, కొమ్ము శ్రీనివాస్ ,అమ్మ సాంబయ్య ,ముజిగిరి చంద్రమౌళి, చిట్టి రమేష్ ,బుట్టి సురేష్ ,నంద రాజ్ కుమార్ ,అమ్మ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# గడువులోగా సర్‌ను పూర్తి చేయాలి

## రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ కార్యక్రమంపై సమీక్షించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్--సర్) కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ఎస్ఐఆర్ కార్యక్రమ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... ఎస్.ఐ.ఆర్. కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వోలు జూలై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూలై 24 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేసి, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించి, సెప్టెంబర్ 28 నాటికి వాటిని పరిష్కరించి అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. జిల్లాలో మొత్తం 1,460 పోలింగ్ స్టేషన్లు, 12,43,781 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటి వరకు 8,48,491 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేశామని తెలిపారు. ఇది 68.22 శాతం పురోగతికి సమానమని, ఇంకా 3,95,290 మంది ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే డిజిటలైజ్ చేసిన వివరాల్లో సుమారు 72 వేల ఓట్లకు సంబంధించిన అనామలీలుగా గుర్తించామని, వాటిని రానున్న రెండు నెలల్లో విచారణ ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు. సుమారు 25 వేల మంది ఓటర్లు కేవలం ఎన్యూమరేషన్ ఫారాలను మాత్రమే సమర్పించి, అవసరమైన వివరాలు నమోదు చేయకపోవడంతో మ్యాపింగ్ జరగలేదని తెలిపారు. అటువంటి వారికి నోటీసులు జారీ చేస్తామని, నోటీసులు అందిన వెంటనే అవసరమైన ధృవీకరణ పత్రాలు సమర్పిస్తే పరిశీలించి, అర్హులైన వారి పేర్లను తుది ఓటరు జాబితాలో చేర్చుతామని స్పష్టం చేశారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదలైన తర్వాత మ్యాపింగ్ సక్రమంగా జరగని వారి వివరాలపై ఎన్నికల అధికారు లు సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీచేస్తారని తెలిపారు. నోటీసులకు నిర్దేశిత సమయంలో స్పందించి అవసరమైన పత్రాలు సమర్పిస్తే వాటిని పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి పేరును తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాలో చేర్చుతామని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో 12 రకాల ధ్రువీకరణ పత్రాలను ఆధారాలుగా పరిగణిస్తామని కలెక్టర్ తెలిపారు. అవసరమైన పత్రాల కోసం ప్రజలు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత శాఖల ద్వారా వెంటనే జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరుకు ఎస్ఐఆర్ తుది ఓటరు జాబితాలో స్థానం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం అధికారులు 85 శాతం వరకు డిజిటలైజేషన్ పూర్తి చేయగలరని, అయితే 100 శాతం పూర్తి కావాలంటే ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. బీఎల్‌వోలు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను ప్రజల నుంచి తిరిగి సేకరించేందుకు సహకరించాలని, ఓటర్లు పూర్తి వివరాలతో ఫారాలను అందజేసేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వీలైనంత ఎక్కువ మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తయ్యేలా అందరూ కృషి చేయాలని, తక్కువ సంఖ్యలో మాత్రమే మ్యాపింగ్ కాని ఓటర్లు మిగిలితే వారికి అవసరమైన పత్రాలు సేకరించి తుది జాబితాలో చేర్చడం సులభమవుతుందని కలెక్టర్ అన్నా రు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ... ఎన్యూమరేషన్ ఫారం అందని ఓటర్లు ఆన్‌లైన్ ద్వారా కూడా ఫారాన్ని పొందవచ్చని తెలిపారు. ఎవరికైనా ఫారం అందకపోతే వెంటనే సంబంధిత బీఎల్‌వోను సంప్రదించి ఫారం తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్డీసి సదానందం, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఎన్నికల విభాగ డిటి అన్సారీ, అధికారులు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, బిజెపి పార్టీ ప్రతినిధులు వి.రాజేష్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు బెల్లం వేణుగోపాల్, మంకెన రమేష్, కె.వెంకట్ రావు, బిఆర్ఎస్పి ప్రతినిధి లింగనబోయిన సతీష్ బాబు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణ ప్రసాద్, సిపిఎం పార్టీ ప్రతినిధి సిహెచ్. వెంకటేశ్వర్లు, సిపిఐ ఎం పార్టీ ప్రతినిధులు నెల్లూరి వీరబాబు, బీఎస్పీ పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, అధికారులు, తదితరులున్నారు.

# కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డిని కలిసిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ



**ఏన్కూరు, జూలై 15 , పీపుల్స్ డైరీ) :** కొత్తగూడెం కు విచ్చేసిన కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి ని పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్ మల్లై అంజిరెడ్డిని కొత్తగూడెంలో తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు కలిశారు. రాష్ట్ర జేఏసీ చైర్మన్ మరియు అధ్యక్షులు పులి లక్ష్మయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు ప్రధానంగా క్రింది డిమాండ్లను ప్రస్తావించారు: ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.సమాన పనికి సమాన వేతనం అమలుచేయాలి. ఔట్‌సర్సిగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వర్తింపజేయాలి. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు కల్పించాలి.ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో వెయిటేజ్ మార్కులు ఇవ్వాలి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజి రెడ్డి మాట్లాడుతూ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల శ్రమను దోపిడీ చేస్తున్న పరిస్థితులు ఆందోళనకరమని అన్నారు. తక్కువ వేతనాలు, జీతాల ఆలస్యం, ఏజెన్సీల దోపిడీ కారణంగా ఉద్యోగుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. కొంతమంది అధికారులు కూడా ఉద్యోగులను వ్యక్తిగత పనులకు వినియోగిస్తూ వేధింపులకు పాల్పడుతున్నారని, ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సహించబోమని హెచ్చరించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సమగ్రంగా చర్చించి వినతిపత్రం అందజేశామని తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి ఒకటో తేదీన జీతాల చెల్లింపు, ప్రమాద బీమా (ఆక్సిడెంటల్ పాలసీ) అమలు చేయడం అభినందనీయమని పేర్కొంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఏజెన్సీల వ్యవహారాలపై జరుగుతున్న ఆడిట్‌ను పారదర్శకంగా నిర్వహించి, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, అవసరమైతే సంబంధిత ఏజెన్సీలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షులు పులి లక్ష్మయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోనగిరి రవి కిరణ్, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్పుల సుధాకర్, కార్తీక్, మౌలిష్, శ్రీనివాస్, పార్థు, వెంకట్రావు, సురేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కొనసాగుతున్న నిరసన

**గణపురం, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** వైటీపీఎస్‌లో బొగ్గు, బూడిద విభాగాల నిర్వహణను 255 కోట్ల వ్యయంతో మూడు సంవత్సరాల పాటు ప్రైవేటీకరణకు అప్పగించే టెండర్ ప్రక్రియను చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ కేటీపీపీలో టీజీపిఈ జెఏసి పిలుపు మేరకు బుధవారం 20వ రోజు భోజన విరామ సమయంలో విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రధాన గేటు ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యుత్ సంస్థల్లో కీలకమైన ఆపరేషన్ విభాగాలను ప్రైవేటీకరించడం వల్ల ఉద్యోగ భద్రత దెబ్బతినడమే కాకుండా, పనిభారం అసమానంగా పెరగడం, అనుభవజ్ఞులైన సిబ్బందిని పక్కన పెట్టడం, భద్రతా ప్రమాణాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బొగ్గు, బూడిద ప్రైవేటీకరణ టెండర్ ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## ఎస్ఐఆర్‌ను పర్యవేక్షించిన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి

**ఏన్కూరు, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గం ఏన్కూర్ మండలం టీ.ఎల్.పేట గ్రామంలో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు బాదావత్ బాలాజీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్.జే.సీ. కృష్ణ, ఖమ్మం జిల్లా సీనియర్ నాయకులు కట్టా కృష్ణార్జున, వైరా నియోజకవర్గ నాయకులు గిరిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎల్ఓలతో సమావేశమై ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు తీరును సమీక్షించి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏన్కూర్ మండలం సీనియర్ నాయకులు యండార్తి మోహన్‌రావు, గిద్దగిరి సత్యనారాయణ, తిమ్మ రావుపేట సర్పంచ్ గుగులోత్ సుమలత, టీ.ఎల్.పేట గ్రామ సర్పంచ్ గుగులోత్ ప్రవీణ్ నాయక్, ఉపసర్పంచ్ నామా



వెంకయ్య, బీఎల్ఏ ఎస్‌కే ఖాసీం, గడం వెంకటేశ్వర్లు, పూర్ణకంటి నాగరాజు, మాదేని సాయి, భూక్యా శివ, కోనపల్లి నరేష్, చల్లా కోటేశ్వరరావు, ఉపేందర్, బారపాటి వెంకటనారాయణ, లక్ష్మయ్య, రవి, భూక్య ధర్మా, కడియాల సుధాకర్, వినోద్, బాబూలాల్, జరపాల లింగ, అరెం కోటేష్, వాకడోత్ లక్ష్మణ్ నాయక్, ధారావత్ కృష్ణ, యేసుబాబు, రామస్వామి, ఇంజం దేవదాస్, నజీర్ తదితర నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# గుండెపోటుతో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి నాయక్ మృతి

## న్యాయవాద వర్గంలో విషాదం.. రాజకీయ, సామాజిక ప్రముఖుల ఘన నివాళి





**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జూలై 15 (పీపుల్స్ డైరీ) :** ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది భూక్యా రవి నాయక్ గుండెపోటుతో కన్నుమూశారు. ఉదయం ఆకస్మికంగా గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్న సమయంలో మరోసారి తీవ్ర గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారు. రవి నాయక్ మృతి వార్త తెలిసిన వెంటనే ఇల్లందు న్యాయవాద వర్గంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటీవల జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన రవి నాయక్, న్యాయవాదుల సంక్షేమం కోసం చొరవ చూపుతూ గుర్తింపు పొందారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆయన కృషితో న్యాయ విద్యను పూర్తిచేసి, ప్రతిభావంతమైన న్యాయవాదిగా పేరు సంపాదించారు. జీవితంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటున్న తరుణంలో రవి నాయక్ అకాల మరణం న్యాయవాద వర్గానికే కాకుండా ఇల్లందు పట్టణానికి తీరని లోటని బిఆర్ఎస్ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు దిండిగల రాజేందర్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ అజ్మీర బావ్ సింగ్ నాయక్, మాజీ ఇల్లందు రైతుబంధు కమిటీ చైర్మన్ సీనియర్ న్యాయవాది సూర్యపాక సత్యనారాయణ, ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మడుగు సాంబమూర్తి, రవి నాయక్, మాజీ ఎంపిటిసి పూణెం సురేందర్, కాంగ్రెస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎట్టి హరికృష్ణ, వడ్ల శ్రీను ఉపేందర్ సీనియర్ న్యాయవాదలు బాలకృష్ణ, దంతాల ఆనంద్,పలువురు సీనియర్ న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.



## ఎస్ఐఆర్ పత్రాలు 25లోపు సమర్పించాలి

### రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి.. ఓటర్లు నిర్లక్ష్యం చేయొద్దు : దిండిగాల రాజేందర్

**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జూలై 15 (పీపుల్స్ డైరీ) :** ఎన్నికల కమిషన్ చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటర్లు పత్రాలను సకాలంలో పూరించి సంబంధిత బూత్ లెవల్ అధికారులకు సమర్పించాలని బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్ కోరారు. ఇల్లందు పట్టణంలోని 2వ బస్తీలోని తన నివాసంలో కుటుంబ సభ్యులు 11 మందికి సంబంధించిన ఎస్ఐఆర్ పత్రాలను పూరించి, వార్డుకు నియమితులైన బూత్ లెవల్ అధికారి శారదకు అందజేసి రసీదు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్ఐఆర్ పత్రాల సమర్పణకు జూలై 25 చివరి తేదీ కావడంతో ప్రతి ఓటరు గడువులోగా వివరాలు పూర్తిగా నింపి సంబంధిత బీఎల్‌వోకు అందజేసి రసీదు తీసుకోవాలని సూచించారు. ఇంకా పత్రాలు అందని వారు వెంటనే తమ బూత్ లెవల్ అధికారులను సంప్రదించాలని తెలిపారు. పత్రాలు స్వీకరించిన వారు వాటిని తిరిగి సమర్పించకపోతే ఓటరు జాబితాపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున నిర్లక్ష్యం చేయకుండా గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ప్యూరిఫైడ్ ప్లాంటును ప్రారంభించిన శెట్టిపల్లి



**ఏన్కూరు, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** ఖమ్మం జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన గార్ల ఒడ్డు శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయంలో పాల్వంచ చెందిన భక్తుడు పట్టాభిరామారావు విజయలక్ష్మి దంపతులు విరాళంగా అందజేసిన 50 వేల రూపాయల విలువచేసి వాటర్ ప్యూరిఫైడ్ ప్లాంట్ ను బుధవారం గార్ల ఒడ్డు సొసైటీ అధ్యక్షులు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్యూరిఫైడ్ వాటర్ను భక్తులుగా అందజేసే విధంగా దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రతి శని, సోమవారాలలో అధిక సంఖ్యలో భక్తులు రావడం జరుగుతుందని, భక్తులకు ప్యూరిఫైడ్ వాటర్ నందు చేయడం కోసం దాతలు సహకారం దేవాలయాభివృద్ధి కోసం పాటుపడుతున్న సిబ్బందిని అభినందించారు. అనంతరం దేవాలయాలకు స్వామివారి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ మేనేజర్ ఎస్ వి డి ప్రసాద్,వేణుగోపాల చార్యులు, నాగరాజ చార్యులు, గ్రామస్తులు, భూక్యా లాలూ నాయక్, ప్రేలపోలు వర శంకర ప్రసాద్,గోరంట్ల రమణయ్య, దేవాలయ సిబ్బంది నారాయణ రావు,శరత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి : ఎమ్మెల్యే



**ఏన్కూరు, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని వైరా ఎమ్మెల్యే. మాలోత్ రాందాస్ నాయక్ కోరారు. బుధవారం ఏన్కూరు లో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఓటరుకు ఎస్ ఐ ఆర్ లో స్థానం కల్పించడమే లక్ష్యమన్నారు. బిఎల్ఓలు ఇంటింటికి తిరిగి ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు ,తహశీల్దార్ సిహెచ్ శేషగిరిరావు, ఎంపీడీవో భాగ్యశ్రీ, ఏఎంసి చైర్మన్ లచ్చిరాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబర్చిన అధికారులను అభినంధించిన సీపీ



**ఖమ్మం, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** జులై 7 నుండి 9 వరకు వరంగల్ జిల్లా మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల పరేడ్ గ్రౌండ్లో జరిగిన భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్-2026 లో వృత్తి నైపుణ్యాల్లో ప్రతిభ కనబరచి పతకాలు సాధించిన పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. జోనల్ స్థాయిలో కనబరిచిన ప్రతిభనే రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాలన్నారు.

### పతకాలు సాధించినవారు

టాస్క్‌ఫోర్స్ ఇన్స్పెక్టర్ వి.ఉదయ్ కుమార్, ఫోరెన్సిక్ సైన్స్, చట్టం ఉదర్యాప్తు రాత పరీక్షలలో రెండు బంగారు పతకాలు, వేలిముద్రల ప్రాక్టికల్ పరీక్షలో కాంస్యం పతకం సాధించారు. కూసుమంచి ఎస్సై వి. దివ్య, వైద్య-న్యాయ పరిశీలన పరీక్షలో రజిత పతకం, ఫోరెన్సిక్ సైన్స్ రాత పరీక్షలో కాంస్య పతకం సాధించారు. ఏఆర్ కానిస్టేబుల్ ఎం. మహేష్, యాక్సెస్ కంట్రోల్ పరీక్షలో కాంస్యం పతకం సాధించారు. ఏఆర్ కానిస్టేబుల్ పి.కిరణ్, డాగ్ స్క్వాడ్ పోటీలో కాంస్య పతకం సాధించారు. ఈ డ్యూటీ మీట్లో జోనల్ పరిధిలోని వరంగల్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్లతో పాటు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన పోలీసులు అధికారులు కంప్యూటర్ పరిజ్ఞానం, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ప్రొఫెషన్, ఫొటో, వీడియో గ్రాఫిక్ విభాగాల్లో పోటీ పడ్డారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీ సాంబరాజు పాల్గొన్నారు.

## టాటా మ్యాజిక్‌లో విద్యార్థుల తరలింపుపై ఎస్సైకి ఫిర్యాదు

**మొగుళ్ళపల్లి, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** మండలంలో ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా టాటా మ్యాజిక్ వాహనాల ద్వారా విద్యార్థులను లెక్కకు మించి తీసుకెళుతున్నటువంటి వాహనదారులపై , ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మొగుళ్లపల్లి ఎస్సై ముప్పు సురేష్‌కు ఏబీవీపీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. విద్యార్థులను ప్రైవేటు పాఠశాలకు తీసు కువెళ్లేందుకు నిబంధనలకు విరుద్ధంగా టాటా మ్యాజిక్, ఆటో వాహనం ద్వారా విద్యార్థులను అధికంగా వాహనంలో ఎక్కిస్తూ విద్యార్థుల జీవితాలతో ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. దీనినీ ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తూ. మొగుళ్ళపల్లి ఎస్ఐ ముప్పు సురేష్‌కి ఫిర్యాదు చేశారు. పాఠశాల యూని ఫాం, పుస్తకాల పేరిట అధిక ఫీజులు వసూలు చేస్తున్న, ఇప్పటి వరకు మండల విద్య శాఖ అధికారి ఎలాంటి చర్యలు తీసుకోక పోవడమే కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని ఖండిస్తున్నామని వెంటనే ప్రైవేట్ పాఠశాలలను తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని లేదంటే ఏబీవీపీ ఆధ్వ ర్యంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమం లోనగర కార్యదర్శి అజయ్, అబిగ్న, అభిరామ్ పాల్గొన్నారు.

# ఉమ్మడి ఖమ్మం జిల్లా రహదారుల అభివృద్ధికి కేంద్రమంత్రికి తుమ్మల లేఖలు

**ఖమ్మం, జూన్ 15 (పీపుల్స్ డైరీ) :** ఖమ్మం జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి, ప్రయాణికుల భద్రత లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర రోడ్డు రవాణా, రహదారులు, ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి నితిన్ జైరాం గడ్కరీకి నాలుగు ప్రత్యేక లేఖలు రాశారు. ఖమ్మం-అశ్వారావుపేట రహదారి నాలుగు వరుసలుగా మార్పు, ఖమ్మం ఔటర్ బైపాస్‌లో మిగిలిన లింకు మంజూరు, కొత్తగూడెం-పాల్వంచ పట్టణాలకు బైపాస్ నిర్మాణం, భద్రాచలం పట్టణానికి బైపాస్ మంజూరుపై ఈ లేఖల్లో ఆయన వివరించారు.



### భద్రాచలం పట్టణానికి బైపాస్.. కరకట్ట హైవేతో పోలిస్తే అత్యంత తక్కువ ఖర్చు...

ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సహా పలు ఉత్తరాది రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి-30 ప్రస్తుతం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం ఉన్న భద్రాచలం పట్టణం నడిబొడ్డు గుండా వెళ్తోందని మంత్రి తుమ్మల తెలిపారు. ఇసుక లారీలు, పారిశ్రామిక, వ్యవసాయ వాహనాలతో పాటు ఏటా భారీ సంఖ్యలో వచ్చే భక్తుల రద్దీ కలగలిసి తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. 10 కిలోమీటర్ల పరిధిలోనే తొమ్మిది ప్రమాద ప్రాంతాలు (బ్లాక్‌స్పాట్లు) ఏర్పడి, ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన పండుగల సమయాల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం భారీ వాహనాలను గంటల తరబడి నిలిపివేయాల్సి రావడంతో భక్తులకు తీవ్ర అసౌకర్యం, సరుకు రవాణాకు ఆలస్యం, రవాణా ఖర్చులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల భద్రాచలం కరకట్ట మీదుగా ప్రత్యామ్నాయ హైవే నిర్మాణ ప్రతిపాదన తెరపైకి వచ్చినా, దానికి రూ.120 కోట్ల భారీ వ్యయం అవుతుందని మంత్రి గుర్తుచేశారు. అదే భద్రాచలం పట్టణానికి ప్రత్యేక బైపాస్ రోడ్డు నిర్మిస్తే కేవలం రూ.25 కోట్లతోనే పూర్తి చేయవచ్చని, ఖర్చు తక్కువగా ఉండటమే కాకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఈ బైపాస్‌తో దీర్ఘకాలిక ట్రాఫిక్ రవాణాకు, ముఖ్యంగా భారీ వాణిజ్య వాహనాలకు పట్టణం గుండా వెళ్లే అవసరం తప్పుతుందని, భక్తులకు సురక్షిత, సౌకర్యవంతమైన ప్రయాణం లభిస్తుందని, ప్రమాదాలు గణనీయంగా తగ్గి, ప్రయాణ సమయం ఆదా అవుతుందని, సరుకు రవాణా మెరుగుపడి ప్రాంత పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎన్‌హెచ్-30 వ్యూహాత్మక ప్రాధాన్యతను, భద్రాచలంలో రహదారి భద్రత అవసరాన్ని పరిగణనలోకి తీసుకుని బైపాస్ నిర్మాణానికి పరిపాలన, ఆర్థిక అనుమతులు తక్షణమే మంజూరు చేయాలని మంత్రి కోరారు.

### ఖమ్మం-అశ్వారావుపేట నాలుగు వరుసలుగా మార్చాలి

జాతీయ రహదారి 365బీబీలోని ఖమ్మం-అశ్వారావుపేట మార్గాన్ని, జాతీయ రహదారి 563లోని వరంగల్-ఖమ్మం మార్గాన్ని తొలుత నాలుగు వరుసలుగా విస్తరించాలని ప్రతిపాదించినట్లు మంత్రి గుర్తుచేశారు. అయితే జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ప్రస్తుత రహదారుల విస్తరణకు బదులు ఖమ్మం-దేవరపల్లి (365బీజీ), వరంగల్-ఖమ్మం (163జీ) పేరుతో కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ రహదారులను చేపట్టిందని తెలిపారు. దీంతో ప్రస్తుత 365బీబీ, 563 రహదారుల విస్తరణ పక్కనపెట్టినట్లు వివరించారు. ఖమ్మం, వెంకటాయపాలెం, తనికెళ్ల, కొణిజర్ల, పల్లిపాడు, వైరా, పినపాక, తల్లాడ, అంజనాపురం, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, గంగారం, మండలపల్లి, అశ్వారావుపేట తదితర జనావాసాల గుండా సాగే ఈ 122 కిలోమీటర్ల రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడి కొనసాగుతుందని, సుమారు 40 బ్లాక్‌స్పాట్లు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజా భద్రత, ప్రాంత అభివృద్ధి దృష్ట్యా ఈ మార్గాన్ని కేంద్ర రహదారుల శాఖకు (మోర్త్) తిరిగి అప్పగించి, నాలుగు వరుసల పనులకు ప్రత్యేక కేసుగా పరిగణించి మంజూరు చేయాలని కోరారు.

### ఖమ్మం ఔటర్ బైపాస్‌లో మిగిలిన 7 కిలోమీటర్ల లింకు..

గ్రీన్‌ఫీల్డ్ రహదారుల నిర్మాణంతో ఖమ్మం పట్టణానికి పశ్చిమ, దక్షిణ, ఆగ్నేయ దిశల్లో బైపాస్ ఏర్పడిందని, సూర్యాపేట-ఖమ్మం నాలుగు వరుసల రహదారి, ఖమ్మం-కురవి (365ఏ) పనులతో ఉత్తర భాగం కూడా పూర్తవుతుందని మంత్రి తెలిపారు. దీంతో ప్రతిపాదిత ఖమ్మం ఔటర్ బైపాస్‌లో దాదాపు 80 శాతం సిద్ధమైందని, అయితే ఖమ్మం-కురవి మార్గానికి, వరంగల్-ఖమ్మం (163జీ) మార్గానికి మధ్య ఆగ్నేయ దిశలో 7 కిలోమీటర్ల కీలక అనుసంధాన లింకు మిగిలి ఉందని వివరించారు. ఖమ్మం-కురవి మార్గాన్ని అమరావతి-నాగపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే లింకుతో అనుసంధానిస్తే ఖమ్మం చుట్టూ నిరంతర రింగ్ రోడ్డు పూర్తిస్థాయిలో సాకారమవుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ లింకు పూర్తయితే ఖమ్మం చుట్టూ అన్ని జాతీయ రహదారుల మధ్య నిరంతర అనుసంధానం ఏర్పడి, పట్టణంలోకి భారీ వాహనాల రాకపోకలు తగ్గి, రద్దీ, ప్రమాదాలు తగ్గుతాయని పేర్కొన్నారు. గత రెండు వార్షిక ప్రణాళికల్లో ఈ ప్రతిపాదన చేర్చినా నిధులు మంజూరు కాలేదని గుర్తుచేస్తూ, ఇప్పటికే భారీగా పెట్టుబడులు పెట్టిన నేపథ్యంలో మిగిలిన లింకుకు ప్రాధాన్యతపై పరిపాలన, ఆర్థిక అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

### కొత్తగూడెం, పాల్వంచలకు బైపాస్ అవసరం..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల మీదుగా సాగే జాతీయ రహదారి 30, ప్రస్తుతం కొత్తగూడెం, పాల్వంచ పారిశ్రామిక పట్టణాల నడిబొడ్డు గుండా వెళ్తుండటంతో తీవ్ర ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాలు, పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి తెలిపారు. ఇసుక లారీలు, పారిశ్రామిక, వ్యవసాయ వాహనాల రాకపోకలతో సుమారు 23 బ్లాక్‌స్పాట్లు ఏర్పడి ప్రాణనష్టం సంభవిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గౌరెల్లి-కొత్తగూడెం మధ్య ఎన్‌హెచ్-930 పూర్తయితే ట్రాఫిక్ మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కారుకొండ, సూరారం, రామవరం, లక్ష్మీదేవిపల్లి, ఓల్డ్ పాల్వంచ, జగన్నాథపురం మీదుగా 25 కిలోమీటర్ల బైపాస్ నిర్మించి, ఎన్‌హెచ్-930పి, ఎన్‌హెచ్-30లను అనుసంధానించాలని మంత్రి ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టుతో రహదారి భద్రత మెరుగుపడటంతో పాటు, ప్రయాణ సమయం తగ్గి, పారిశ్రామిక, ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని పేర్కొంటూ, ప్రాధాన్యతపై మంజూరు ఇవ్వాలని కోరారు.

**కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి నాలుగు ప్రత్యేక లేఖలు**

**ఖమ్మం-అశ్వారావుపేట రహదారి నాలుగు వరుసలుగా మార్పు**

**ఔటర్ బైపాస్‌లో మిగిలిన 7 కి.మీ లింకుకు మంజూరు కోరిన మంత్రి**

**కొత్తగూడెం-పాల్వంచలకు 25 కి.మీ బైపాస్ ప్రతిపాదన**

**భద్రాచలం పట్టణానికి రూ.25 కోట్లతో బైపాస్.. తక్కువ వ్యయంతో శాశ్వత పరిష్కారం**



# విద్యుత్ ఉత్పత్తిలో కేటీపీపీ స్టేజ్-2కు హ్యాట్రిక్ రికార్డు

**100 రోజుల ఉత్పత్తి కొనసాగుతూనే మరో ఘనత దిశగా యూనిట్**

**ఉద్యోగుల కృషి, సాంకేతిక నైపుణ్యమే విజయ రహస్యం**

**ఉద్యోగులను అభినందించిన సీఈ శ్రీ ప్రకాష్**

**గణపురం, జులై 15 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండలంలోని చెల్పూర్ గ్రామంలోని కేటీపీపీ (కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు) స్టేజ్-2 (600 మెగావాట్లు) యూనిట్ అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎలాంటి అంతరాయం లేకుండా 100 రోజుల నిరంతర విద్యుత్ ఉత్పత్తి సాధించి మరోసారి తన సత్తా చాటింది. విశేషమేమిటంటే, గత ఏడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది జూలై వరకు కేవలం ఏడాది వ్యవధిలోనే ఈ యూనిట్ మూడుసార్లు 100 రోజులకు పైగా నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి చేసి అరుదైన రికార్డును నెలకొల్పింది. గత ఏడాది ఆగస్టు 7 నుంచి నవంబర్ 20 వరకు వరుసగా 105 రోజులు, నవంబర్ 23 నుంచి ఈ ఏడాది మార్చి 17 వరకు 114 రోజులు, అనంతరం ఏప్రిల్ 4 నుంచి జులై 13 వరకు 100 రోజుల పాటు నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి చేసింది. ప్రస్తుతం కూడా యూనిట్ ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తుండటం విశేషం. ఈ సందర్భంగా కేటీపీపీ చీఫ్ ఇంజనీర్ శ్రీప్రకాష్ మాట్లాడుతూ... ఈ ఘనత సంస్థలోని సాంకేతిక నిపుణుల సామర్థ్యం, సమర్థవంతమైన నిర్వహణ, ఉద్యోగుల అంకితభావం, సమష్టి కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సృష్టించి సంస్థకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఈ విజయాన్ని ఉద్యోగులతో కలిసి ఆనందంగా పంచుకుని అభినందనలు తెలిపారు.

# అట్టహాసంగా వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ గ్రాండ్ ప్రమోషన్

**సామాజికవేత్తలు, ప్రొఫెసర్లు ప్రముఖుల సమక్షంలో ట్రైలర్, సాంగ్స్ రిలీజ్ - 17న రాష్ట్రవ్యాప్తంగా విడుదల కానున్న వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ**







**హనుమకొండ, జులై 15 (పీపుల్స్ డైరీ) :** హనుమకొండ హంటర్ రోడ్‌లోని మాస్టర్ జీ డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ గ్రాండ్ ప్రమోషన్ అట్టహాసంగా జరిగింది.... కూడా మాజీ చైర్మన్, ఓబీసీ చైర్మన్ ఎస్. సుందర్ రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ గ్రాండ్ ప్రమోషన్ నిర్వహించారు.. పలువురు సామాజిక వేత్తలు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, అన్ని వర్గాల ప్రముఖుల చేతుల మీదుగా విద్యార్థుల కేరింతల నడుమ ట్రైలర్, సాంగ్స్ రిలీజ్ చేశారు.. వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం జానకిపురం గ్రామానికి చెందిన ఆడబిడ్డ కోమలి మహేందర్ సాహసోపేతంగా ధైర్యం చేసి కుటుంబ నేపథ్యమున్న సినిమా తీయడంతో వారిని శాలువతో సుందర్ రాజ్ యాదవ్ సన్మానించి అభినందనలు తెలిపారు.... ట్రైలర్ ఉ సాంగ్స్ రిలీజ్ చేసిన అనంతరం మాజీ కూడా చైర్మన్, ఓబీసీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్,వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ నిర్మాత కోమలి మహేందర్ మీడియా సమావేశం నిర్వహించారు.. జానపద కళాకారిని, సారంగదరియా పాటపాడిన కోమలి సినిమా తీయడం గర్వకారణమని సుందర్ రాజ్ యాదవ్ అన్నారు. సినిమా నిర్మాత కోమలి మహేందర్ మాట్లాడుతూ.... ఈ సినిమా కోసం పెద్ద సాహసం చేశానని,కోమలి క్రియేషన్ బ్యానర్‌తో వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ తీసానన్నారు...చాలా మంచి ఫ్యామిలీ సినిమా,కుటుంబాన్ని నిలబెట్టుకోవాలనే మెసేజ్ తో ప్రేమకథ ప్రేమకథ సినిమా తీయడం జరిగిందన్నారు...ప్రతి ఒక్కరు కుటుంబ సమేతంగా గర్వంగా చూడవలసిన సినిమా అన్నారు... ప్రతి ఒక్కరు వెంకట్రామయ్య గారి తాలూకా సినిమా చూసి విజయ వంతం చేయాలన్నారు. జూలై 17న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 60 థియేటర్లతో పాటు హనుమకొండ లోని శ్రీదేవి ఏషియన్ మాల్, కాజీపేట భవాని థియేటర్లలో రిలీజ్ కానుందని తెలిపారు..వరంగల్ ఆడబిడ్డ చేసిన ఈ ప్రయత్నాన్ని గెలిపిస్తారని మనసారా ఆశిస్తున్నానన్నారు.. మాస్టర్ జీ కళాశాల వేదికగా గ్రాండ్ ప్రమోషన్ నిర్వహించినందుకు సుందర్ రాజ్ యాదవ్‌కు నిర్మాత కోమలి మహేందర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో మాస్టర్ జీ డిగ్రీ, పీజీ కళాశాల జనరల్ సెక్రెటరీ అచ్యుత్ రాజ్,ఓబీసీ ప్రధాన కార్యదర్శి, ప్రొఫెసర్ గద్దం భాస్కర్, తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్, ప్రైవేట్ లెక్చరర్స్ ఫోరమ్ అధ్యక్షుడు గంగాపురం వేణు మాధవ్ గౌడ్, ఓబీసీ సభ్యులూ చిగుమల్ల మౌనిక, ప్రముఖ అడ్వకేట్ బండా వివేకానంద, పారిశ్రామికవేత్త గుండా శ్రీనివాస్, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు ఎస్‌బీఐ ఎస్జిఎస్పి శాలరీ ప్యాకేజ్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ఎస్‌బిఐ ఎస్జిఎస్పి శాలరీ ప్యాకేజ్‌తో ఉద్యోగులకు మరింత ఆర్థిక భద్రత**


**ఎస్‌బిఐ స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ శాలరీ ప్యాకేజ్ ప్రయోజనాల కరపత్రాలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థిక భద్రత, మెరుగైన బ్యాంకింగ్ సేవలు, కుటుంబ సభ్యులకు అదనపు ప్రయోజనాలు కల్పించే లక్ష్యంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) అందిస్తున్న స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ శాలరీ ప్యాకేజ్ (ఎస్జిఎస్పి) ద్వారా లభించే ప్రయోజనాలను ప్రతి ప్రభుత్వ ఉద్యోగి సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌బిఐ రూపొందించిన ఎస్.జి.ఎస్.పి. శాలరీ ప్యాకేజ్ కరపత్రాలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఎస్‌బిఐ అధికారులు ప్యాకేజ్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు అందుబాటులో ఉన్న ప్రత్యేక సౌకర్యాలు, బీమా రక్షణ, కుటుంబ సభ్యులకు లభించే ప్రయోజనాలు, రుణ సదుపాయాలు, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు తదితర అంశాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎస్‌బిఐ ప్రత్యేకంగా రూపొందించిన స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ శాలరీ ప్యాకేజ్ (ఎస్జి ఎస్పి) ద్వారా అనేక విలువైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం సాధారణ శాలరీ ఖాతాలను నిర్వహిస్తున్న ఉద్యోగులు తమ ఖాతాలను స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ శాలరీ ప్యాకేజ్ ఖాతాలుగా మార్పుకోవడం ద్వారా అదనపు ఆర్థిక భద్రతతో పాటు పలు ప్రత్యేక బ్యాంకింగ్ సేవలను పొందే అవకాశం ఉంటుందని అన్నారు. ఉద్యోగులు మాత్రమే కాకుండా వారి కుటుంబ సభ్యులు కూడా ఎస్జిఎస్పి ద్వారా ప్రత్యేక బ్యాంకింగ్ సేవలను పొందగలరని, అవసరమైన సమయంలో ఆకర్షణీయమైన రుణ సదుపాయాలు, ప్రాధాన్య సేవలు, డిజిటల్ బ్యాంకింగ్ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ ప్యాకేజ్ ద్వారా లభించే ప్రయోజనాలపై అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పూర్తి అవగాహన పెంపొందించుకుని వాటిని వినియోగించుకోవాలని సూచించారు. స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ శాలరీ ప్యాకేజ్ ద్వారా ఒక కోటి రూపాయల వరకు ఉచిత ప్రమాద భీమా (ఆక్సిడెంటల్ ఇన్సూరెన్స్) రక్షణ ఉంటుందన్నారు. ఎస్బిఐ రిష్తే (ఎస్బిఐ రిషితే) ద్వారా కుటుంబ సభ్యులకు ప్రత్యేక బ్యాంకింగ్ సౌకర్యాలు, ఆకర్షణీయమైన ప్రయోజనాలు ఉంటాయన్నారు. తక్కువ వడ్డీ రేట్లతో వ్యక్తిగత, గృహ, వాహన తదితర రుణ సౌకర్యాలు పొందవచ్చని తెలిపారు. ఆధునిక డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, యోనో (యోనో) వంటి సౌకర్యాల ద్వారా సులభమైన బ్యాంకింగ్ లావాదేవీలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ వనపల్లి శ్రీనివాసరావు, చీఫ్ మేనేజర్ రామ్ బరన్, ఎల్డీఎం ఎ.రవిప్రసాద్, కలెక్టరేట్ బ్రాంచ్ మేనేజర్ డి.సునీత, అధికారులు, సిబ్బంది తదితరులున్నారు.

# అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలి

**ఇసుక సరఫరాపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్**



**ఖమ్మం, జూలై 15 (పీపుల్స్ డైరీ) :** జిల్లాలో వివిధ ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఇసుక సరఫరా ఆన్‌లైన్ లోనే బుకింగ్ జరగాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఇసుక సరఫరాపై వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఇసుక సరఫరా ఆన్‌లైన్ లో పూర్తి పారదర్శకంగా జరగాలన్నారు. జిల్లాలో పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులకు ఇప్పటి వరకు ఎంత పరిమాణం ఇసుక, ఎక్కడెక్కడి నుండి పొందింది నివేదిక సమర్పించాలన్నారు. ఇసుకను టీజీఎండీసీ, స్యాండ్ బజార్, స్థానికంగా సమకూర్చుకోవాలని, ఇదీ బుకింగ్ ఆన్‌లైన్ లోనే చేయాలని అన్నారు. జిల్లాలోని అన్ని స్యాండ్ బజార్ లలో 1000 క్యూబిక్ మీటర్ల మేర ఇసుక అందుబాటులో ఉంచామన్నారు. ఇసుక రీచ్ ల వారీగా వచ్చిన ఆదాయం వివరాలు వెంటనే సమర్పించాలని, ఇట్టి ఆదాయాన్ని నిబంధనల మేరకు ఆయా గ్రామ పంచాయతీ తదితరాలకు పంపిణీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇంజనీరింగ్ శాఖలు తమ తమ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల విషయమై సమస్యలు ఉంటే వెంటనే నివేదిక అందించాలని, అట్టి సమస్యల సత్వర పరిష్కారానికి సంబంధిత శాఖలచే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎలాంటి అలసత్వం లేకుండా, నిర్ణీత గడువులోపు అభివృద్ధి పనుల పూర్తికి కార్యాచరణ చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ యగందర్ రావు, పీవో టిజిఎండిసి జి.శంకర్, మైన్స్ ఏజి ఎ.రమేష్, విద్యా శాఖ ఇఇ బుగ్గయ్య, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వర రావు, పీఆర్ ఇఇ లు మహేష్ బాబు, రామకోటి, డిఇలు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శర్మ, అధికారులు, తదితరులున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN**, PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com